జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 4 సంచిక 238 | హైదరాబాద్, జూన్ 17 గురువారం 2021 | 8 పేజీలు | వెల : 5.00

# ఆత్మగౌరవాన్ని తుంగలో తొక్కిన ఈటెల

## మండిపడిన మావోయిస్టు పార్టీ... లేఖ విడుదల చేసిన జగన్



హైదరాబాద్,జూన్ 16, ప్రజాపాలన ప్రతినిధి: మాజీ మంత్రి బీజేపీ నేత ఈటల రాజేందర్‌పై తెలంగాణ మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్ ఘాటు లేఖ విడుదల చేశారు. ఈటల అసెంబ్లీ స్థానానికి రాజీనామా చేస్తూ ఇచ్చిన ప్రకటనను తెలంగాణ మావోయిస్టు పార్టీ ఖండించింది. ఈటల రాజేందర్ తన అసెంబ్లీ స్థానానికి రాజీనామా చేస్తూ ఇచ్చిన ప్రకటనను జగన్ తప్పుబట్టారు. కేసీఆర్ ఫ్యూడల్ పెత్తనానికి వ్యతిరేకంగా తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం కోసం పోరాడతానని అందుకోసం ఆర్ఎస్ఎస్ నుంచి పోరాడాలని ఈటల ప్రకటన చేశారు. ఆ ప్రకటన చేసిన అనంతరం హిందూత్వ పార్టీ అయినా బీజేపీ తీర్థం పుచ్చుకున్నారని జగన్ పేర్కొన్నారు. ఇది సీఎం కేసీఆర్‌కు ఈటలకు మధ్య జరుగుతున్న పోరాటమని.. దీనితో తెలంగాణ ప్రజలకు సంబంధం లేదన్నారు.కేసీఆర్, ఈటల ఒకే గూటి పక్షులని జగన్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. కేసీఆర్, ఈటల రాజేందర్ అధికారంలోకి రాగానే తెలంగాణ ప్రజల ఆకాంక్షకు తూట్లు పొడిచారన్నారు. వీరి పాలన ప్రజా వ్యతిరేకమైనదన్నారు. మొన్నటి వరకూ కేసీఆర్ పక్కనే ఉండి అధికారాన్ని అనుభవించిన ఈటల తన ఆస్తుల పెంపుదలకు యత్నించారని జగన్ విమర్శించారు. అందులో భాగంగా పేదల భూములను అక్రమంగా ఆక్రమించారన్నారు. తెలంగాణలో ఆత్మగౌరవం కోసం పోరాటం చేస్తామని ప్రకటిస్తూ తన ఆస్తుల రక్షణ కోసం నేడు బీజేపీలో చేరారన్నారు. ఈటల తీసుకున్న ఈ నిర్ణయాన్ని తెలంగాణలోని ప్రజలు, ప్రజాస్వామిక వాదులు వ్యతిరేకిస్తున్నారన్నారు. మావోయిస్టులు కూడా తనకు మద్దతు ఇస్తారని ఈటల చెప్పుకోవడం పచ్చి మోసం అని ప్రజలకు తెలియజేస్తున్నామని మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్ పేర్కొన్నారు.

**'బిజెపిలో చేరవద్దంటూ ప్రజాస్వామిక వాదులు ఈటెలకు సూచించినా..నిస్సుగ్గుగా చేరి అవకాశవాదానికి, రాజకీయ స్వార్దానికి పాల్పడ్డారు. అసలైన ఆత్మగౌరవ పోరాటానికి ప్రజలు సిద్దం కావాలి. అటు హిందుత్వ ఫాసిస్టు పార్టీగా బిజెపికి ఇటు నిరంకుశ పార్టీగా టీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.'**



## తెరాస ఎంపీ నామాకు ఈడీ సమన్లు

హైదరాబాద్,జూన్ 16, ప్రజాపాలన ప్రతినిధి: బ్యాంకు రుణాల మళ్లింపు వ్యవహారంలో తెరాస లోక్‌సభాపక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. ఈ నెల 25న విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొంది. నామాతో పాటు మధుకాన్ కేసులో నిందితులందరికీ ఈడీ సమన్లు పంపింది. ఎంపీకి చెందిన మధుకాన్ సంస్థతో పాటు, గ్రూప్ డైరెక్టర్ల ఇళ్లలో ఈడీ ఇటీవల రెండు రోజుల పాటు సోదాలు జరిపిన విషయం తెలిసిందే.సోదాల్లో భాగంగా భారీగా నగదు, దస్త్రాలను అధికారులను స్వాధీనం చేసుకున్నారు. దస్త్రాలు, బ్యాంకు ఖాతాలు, హార్డ్ డిస్కులను ఈడీ అధికారులు విశ్లేషిస్తున్నారు. జాతీయరహదారి నిర్మాణం కోసం రాంచీ ఎక్స్‌ప్రెస్ హైవే ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో వివిధ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని ఇతర అవసరాల కోసం మళ్లించినట్టు మధుకాన్ గ్రూప్‌పై ఈడీ అభియోగం దాఖలు చేసిన విషయం తెలిసిందే.

## కరోనా కష్టంలోనూ సంక్షేమ పథకాలు ఆగలేదు:కేటీఆర్




బోయిన్‌పల్లి,జూన్ 16, ప్రజాపాలన ప్రతినిధి: కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ఏ ఒక్కటీ ఆగలేదని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో ఊహించని అభివృద్ధి జరుగుతోందని అన్నారు. తెలంగాణను, తెలంగాణ ప్రజలను కేసీఆర్ ప్రేమించినంత ఎవరూ ప్రేమించరు అని పేర్కొన్నారు. కొదురుపాకలో రైతువేదికను మంత్రి ప్రశాంత్‌రెడ్డితో కలిసి కేటీఆర్ ప్రారంభించారు. కేడీసీసీ బ్యాంకు, విలాసాగర్ ఎత్తిపోతలను ప్రారంభించారు. అనంతరం కొదురుపాక జంక్షన్ రోడ్డు వెడల్పు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, ఎంపీ సంతోష్ కుమార్, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఎమ్మెల్సీ లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి వంటి పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేవు. నోరుందని ప్రతిపక్షాలు ఎటుబడితే అటు మాట్లాడితే చెల్లదు. రైతులు పండించిన ధాన్యాన్ని కొన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. వరిధాన్యం పండించడంలో దేశంలోనే నెంబర్‌వన్ తెలంగాణ. రైతు వేదికలో నిత్య చైతన్య జ్వాల వెలగాలన్నదే సీఎం కేసీఆర్ ఆకాంక్ష. రైతుల కోసం ఏం చేయడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఆధునిక వ్యవసాయ పద్ధతులు నేర్చుకునేలా రైతువేదికలు ఉపయోగపడాలని' మంత్రి తెలిపారు.'తెలంగాణ రాష్ట్రం రావడం వల్ల ఎంత అభివృద్ధి జరిగిందో తెలుస్తుంది. కాళేశ్వరం ప్రాజెక్టుకు మిడ్‌మానేరు గుండెకాయలా మారింది. వేములవాడ-మిడ్‌మానేరును కలిపి అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తా. ఒకప్పుడు సిరిసిల్ల జిల్లా కరువు ప్రాంతం. సిరిసిల్ల జిల్లాలో 6 మీటర్ల మేర భూగర్భ జలాలు పెరిగాయి. లాల్ బహదూర్ శాస్త్రి అకాడమీలో ఈ అంశాన్ని పాఠ్యాంశంగా చేర్చారు. తెలంగాణ తప్పా దేశంలో ఎక్కడా ధాన్యం కొనుగోలు జరగలేదు. కరోనా కష్టకాలంలో కూడా ధాన్యం కొనుగోలు జరిగిందని' కేటీఆర్ వివరించారు.

## బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం..

### రెండు రోజుల పాటు తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు




హైదరాబాద్,జూన్ 16, ప్రజాపాలన ప్రతినిధి:గత రెండు మూడు రోజులుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. అయితే మరో మూడు రోజుల పాటు రాష్ట్రంలో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు **(మిగతా 2లో..)**



## రెండు రోజుల్లో రూ.1,669.42 కోట్లు రైతుల ఖాతాల్లో జమ

హైదరాబాద్ ,జూన్ 16, ప్రజాపాలన ప్రతినిధి: పెట్టుబడి సాయంగా ప్రభుత్వం అందించే రైతుబంధు సాయం అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతోంది. బుధవారం రెండు ఎకరాల వరకు భూమిని కలిగి ఉన్న సుమారు 15.07 లక్షల మంది రైతులు తమ బ్యాంకు ఖాతాల్లో మొత్తం రూ. 1,152.46 కోట్లు రైతు బంధు సహాయంగా పొందారు. మంగళవారం నుంచి మొత్తం 1,669.42 కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి. రేపు మూడవ రోజు 10.40 లక్షల మంది రైతుల ఖాతాలలో రూ.1272.85 కోట్లు జమకానున్నాయి.మొత్తంమీద మూడు రోజులలో 42.43 లక్షల మంది రైతుల ఖాతాలలో రైతుబంధు కింద 58.85 లక్షల ఎకరాలకు గాను రూ.2,942.27 కోట్లు జమ అవుతున్నాయి. ఈ నెల 25 వరకు రైతులకు రైతుబంధు నిధుల పంపిణీని పూర్తి చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. పత్తి, కంది అధికంగా సాగు చేయడంతో పాటు రైతులు పప్పు దినుసులు, నూనెగింజల పంటల సాగును పెంచాలన్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటల వైపు రైతాంగం దృష్టి సారించాలని పేర్కొన్నారు.

## దేశంలో తొలిసారిగా.. గ్రీన్ ఫంగస్ కేసు నమోదు!



న్యూఢిల్లీ, జూన్ 16, ప్రజాపాలన ప్రతినిధి: దేశంలో కరోనా సెకండ్ వేవ్ వినాశనం సృష్టించింది. పలు రకాల ఫంగస్‌లూ వెలుగులోకి వచ్చాయి. కరోనా నుంచి కోలుకున్న వారిలో బ్లాక్ ఫంగస్‌త్ పాటు వైట్ ఫంగస్ కేసులు నమోదయ్యాయి. తాజాగా తొలిసారిగా గ్రీన్ ఫంగస్ వెలుగులోకి వచ్చింది. తొలిసారిగా మధ్యప్రదేశ్ ఇండోర్‌లోని ఓ వ్యక్తిలో గ్రీన్ ఫంగస్ లక్షణాలు కనిపించాయి. అరబిందో ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో 34 ఏళ్ల వ్యక్తి పరీక్షలు చేయగా.. సైనస్, ఊపిరితిత్తుల్లో ఫంగస్ జాడలు కనిపించాయని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. వెంటనే అతన్ని ముంబైలోని ఓ హాస్పిటల్‌కు తరలించినట్లు వైద్యులు తెలిపారు.ఈ ఫంగస్ బ్లాక్, వైట్ ఫంగస్ కంటే ప్రమాదకరమని పేర్కొంటున్నారు. ఇండోర్‌లోని రూబీ ఆర్చర్డ్ రోడ్డులో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి కొద్ది రోజుల కిందట కరోనా బారినపడి కోలుకున్నాడు. అనంతరం కొవిడ్ అనంతర లక్షణాలతో మళ్లీ ఆసుపతిలో చేరాడు. ఈ క్రమంలో మళ్లీ పరీక్షలు చేయగా.. ఊపిరితిత్తులు, సైనస్‌లో ఆస్పెర్‌గిలోసిస్ ఫంగస్‌ను గుర్తించారు. **(మిగతా 2లో..)**

Ph : 040-23233989
SNEHA MACS Ltd.
"THE SNEHA MUTUALLY AIDED CO-OPERATIVE THRIFT AND CREDIT SOCIETY LIMITED."
SNEHA MACS
SNEHA CLUB
E-mail : info.hyd@snehamacsltd.com
Visit us : www.snehamacsltd.com
బహుజన బ్యాంకు నిర్మాణం కోసం
రండి.. కదలి రండి...!
బహుజన ఆర్థికాభివృద్ధితోనే కులరహిత సమాజం ఏర్పడుతుంది. - డా॥ బి.ఆర్. అంబేద్కర్
బ్యాంకులు, బహుజనులకు అప్పులు సరిగా ఇవ్వట్లేదు అనేది బహిరంగ రహస్యం,
స్నేహా మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటిని గత 12 సం॥ల క్రితం స్థాపించి,
30 వేల కుటుంబాలకు ఆర్థిక పరమైన సేవలను అందిస్తూ..
డిపాజిట్ హోల్డర్లకు అధిక వడ్డీలను ఇస్తుంది.
SNEHA GROUP OF ORGANISATIONS 20 YEARS CELEBRATIONS
బహుజనులకు విజ్ఞప్తి
మన బ్యాంకుల్ని మనం నిర్మించుకున్నపుడే బహుజనుల ఆర్థిక అభివృద్ధ జరుగుతుంది. బహుజన బ్యాంక్ నిర్మాణ క్రమంలో మీరు స్నేహ మాక్స్‌లో సభ్యులుగా చేరి, మీకు తోచిన విధంగా డిపాజిట్ చేసి అధిక వడ్డీని పొందుతూ మీ తోటి పేద బహుజనులకు సహరించండి.
స్నేహ పెన్షన్ స్కీమ్‌లో చేరండి
సంవత్సరానికి 11% వడ్డీ చొప్పున
ఒక లక్ష డిపాజిట్ పై రూ. 11,000/- పొందండి.
నెలవారి వడ్డీ కూడా పొందే సౌకర్యం.
మీ డిపాజిట్ 7 సం.లో రెట్టింపు
బహుజన బ్యాంకు నిర్మాణంలో భాగస్వామ్యంకై
రండి... కదలిరండి...!
జై ఫూలే జై భీమ్ జై బహుజన జై భారత్
Sn. డా॥ కె. శివ భాగ్యారావు బహుజన IRS - vrs
ఫౌండర్ & ఛైర్మన్
సంప్రదించండి
హైదరాబాద్ 7660027682 7842106355
పొన్నూరు 998991763
విజయవాడ 9000621111
తిరుపతి 94400 77239
విశాఖపట్నం 0891-2791205 7660027696

# ప్రత్తి పంట లో అంతరపంటగా కంది, పెసర, వేసుకోవాలి:డాక్టర్ రాజేశ్వర్ నాయక్



బెల్లంపల్లి జూన్ 16 ప్రజా పాలన ప్రతినిధి:పత్తిని పండించే రైతులు అంతర పంటలుగా కంది, పెసర, సాగు చేసుకోవాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రాజేశ్వర్ నాయక్ తెలిపారు. బుధవారం నాడు బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి సహకారంతో ఏర్పాటుచేసిన రైతుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రత్తిలో అంతర పంటలుగా కంది లేదా పెసరను సాగు చేయటం వల్ల భూమిని సారవంతం చేసుకోవడంతో పాటు రసాయనిక ఎరువుల వినియోగం తగ్గుతుందని, అంతేగాక ప్రత్తిని ఆశించే చీడ పీడల ఉధృతి తగ్గి మిత్ర పురుగులు వృద్ధి చెందడంతో రైతుకు అదనపు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. అందువల్ల ప్రత్తిని సాగుచేసే ప్రతి ఒక్క రైతు విధిగా అంతర పంటగా కందిని ప్రతి 6 వరసల ప్రత్తికి 1 వరసలో కంది పంట వేసుకోవడం వల్ల రైతుకు లాభం చేకూరుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సామూహిక క్షేత్ర ప్రదర్శనలో భాగంగా ఆసిఫాబాద్ మండల పరిధిలోని బాబాపూర్ గ్రామానికి చెందిన ఎంపిక చేయబడిన రైతులకి వరంగల్ కంది - 97 రకాన్ని అందచేశారు. అంతేగాక గిరిజన ఉప ప్రణాళిక క్రింద తాండూర్ మండల పరిధిలోని నర్సాపూర్ గ్రామ గిరిజన రైతులకి వరంగల్ కంది - 97 మరియు డబ్లుయు జి జి - 42 పెసర విత్తనాలను అందచేశారు. ముఖ్యంగా కంది విత్తే సమయంలో ప్రతి కేజీ కంది విత్తనానికి 10 గ్రాముల ట్రైకోడర్మా మిశ్రమాన్ని కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డా. శివకృష్ణ, నాగరాజు, డా. తిరుపతి, మరియు డా. సతీష్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల నిర్వహణపై దృష్టి సారించాలి:జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 16(ప్రజా పాలన) :జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనుల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు తో కలిసి, ఆసిఫాబాద్ గ్రామ పంచాయతీ అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసిఫాబాద్ లో ఇటీవల కురిసిన భారీ వర్షాల వలన నీరు నిలువ ఉన్నచోట వెంటనే తొలగించడంతో పాటు గ్రామపంచాయతీ పరిధిలో పాత మురికి కాలువ లకు బదులుగా కొత్త మురికి కాలువలు నిర్మించుట, అక్రమ కట్టడాలు తొలగించుట, జూబ్లీ మార్కెట్ వద్ద సాగునీటి సదుపాయం కలిగించుట,, ఇతర కార్యక్రమాలపై సంబంధిత అధికారులకు తగు జాగ్రత్తలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ జడ్పిటిసి అరిగేల నాగేశ్వరరావు, డిపిఆర్ఈ రామ్మోహన్ రావు, ఈఆర్డబ్ల్యూఎస్ వెంకటపతి, ప్రత్యేక అధికారి రమేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజబాబు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన ఎమ్మెల్యే



అశ్వారావుపేట ప్రజా పాలన ప్రతినిధి : అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు లు మెచ్చా నాగేశ్వర రావు పుట్టినరోజు సందర్భంగా వారి నివాస ప్రాంగణంలో మొక్కలు నాటినారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట ఉపేందర్ ,దమ్మపేట శ్రావణ్ ,జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు ,ఎంపీపీ సోయ్యం ప్రసాద్ ,మండల అధ్యక్షులు దొడ్డాకుల రాజేశ్వరరావు ,మండల ప్రధానకార్యదర్శి దొడ్డా రమేష్,మొద్దులగూడెం సర్పంచ్ సున్నం రాము,ఉప సర్పంచ్ శ్రీరామ్ మూర్తి,మండల నాయకులు బాల శ్రీనివాసరావు,కిషోర్, దొడ్డా నాగేశ్వరరావు,లంక కృష్ణ,దొడ్డా విజయ్ బాబు,పానుగంటి చిట్టిబాబు గారు,,దమ్మపేట గ్రామ కమిటీ అధ్యక్షులు యార్లగడ్డ బాబు గారు పాల్గొన్నారు.

## అశ్వారావుపేట లో ఈనెల 18న ఎస్సీ కార్పొరేషన్ ఇంటర్వ్యూలు

అశ్వారావుపేట ప్రజాపాలన ప్రతినిధి,2020-2021సంవత్సరం ఎస్సీ కార్పొరేషన్ రుణాలు కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఈ నెల 18వ తేదీ శనివారం అశ్వారావుపేట ఎంపీడీవో కార్యాలయంలో జరుగు ఇంటర్వ్యూ లకు హాజరు కావలసిందిగా ఎంపీడీవో విజయ ఓ ప్రకటనలో తెలిపారు.

## 46వ జన్మదిన వేడుకలు

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజా పాలన ప్రతినిధి : కృష్ణ-మహేష్ ప్రజాసేన రాష్ట్ర కార్యదర్శి వనం శ్రీశైలం గౌడ్ 46 జన్మదిన వేడుకలను బుధవారంగూడూరు గ్రామంలో కృష్ణ మహేష్ ప్రజా సేన రాష్ట్ర కార్యదర్శి వనం శ్రీశైలం గౌడ్ జన్మదిన వేడుకలను కృష్ణ మహేష్ ప్రజాసేన భువనగిరి డివిజన్ అధ్యక్షులు దండు నరేష్ ఆధ్వర్యంలో వారి నివాసంలో నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కృష్ణ మహేష్ ప్రజాసేన ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇంచార్జ్ పిట్టల బాల రాజు,యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు నాగేల్లి శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొని కేకు కట్ చేసి పంపిణీ చేశారు.పూలమాల శాలువాతో సన్మానించడం జరిగింది,ఈ కార్యక్రమంలో అభిమానులు యాట కుమార్,జానీ బాయ్ తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో 8 మందికి కరోనా పాజిటివ్

వలిగొండ ప్రజాపాలన ప్రతినిధి మండల పరిధిలోని వలిగొండ,వర్కట్ పల్లి,వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో బుధవారం 209 మందికి కరోనా ర్యాపిడ్ పరీక్షలు నిర్వహించగా అందులో 8 మందికి పాజిటివ్ నిర్ధారణ అయిందని,వారికి కరోనా పట్ల తీసుకోవాలిసిన జాగ్రత్తలు తెలిపి,వారిని హోమ్ క్వారెంటైన్ చేశామని డాక్టర్లు సుమన్ కళ్యాణ్,కిరణ్ కుమార్,స్వామి లు తెలిపారు.

## ఘనంగా యం.పి. వెంకటేష్ నేత జన్మదిన వేడుకలు



జన్నారం, జూన్ 16, ప్రజాపాలన ప్రతినిధి:పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు డా.బోర్లకుంట వెంకటేష్ నేత జన్మదిన వేడుకలను జన్నారంలోని తిమ్మాపూర్ గ్రామంలో సర్పంచ్ ల సంఘం మండల అధ్యక్షుడు జాడిగంగాద్ అద్వర్యం లో స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలోని బక్త హన్మాన్ మందిరంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వెంకటేష్ నేత తల్లి బోర్లకుంట లింగవ్వ కేక్ కట్ చేసి స్వీట్ లు పంచారు. టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ జాడి గంగాధర్ , వార్డు సభ్యులు సిందం చంద్రయ్య, జాడి రాజన్న ,కోవభూమయ్య లు మొక్కలు నాటారు.అదేవిధంగా జన్నారం మండల కేంద్రంలో ని అంబేద్కర్ భవన్ లో దళిత సంఘాల ఆధ్వర్యంలో ఎంపి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది.వెంకటేష్ నేత భవిష్యత్ లో మరింత రాజకీయంగా ఎదిగి ప్రజలకు సేవ చేయాలని నేతకాని , బహుజనులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నేతకాని సంఘం రాష్ట్ర నాయకులు తాళ్ళపెల్లి రాజేశ్వర్ , అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు భరత్ కుమార్,అంబేద్కర్ సంఘం జిల్లా నాయకులు బోర్లకుంట ప్రభుదాస్, అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మామిడిపెల్లి ఇందయ్య రేండ్లగూడ ఎంపిటిసి సభ్యులు దాముక కరుణాకర్ దళిత సంఘాల నాయకులు మల్లేష్, జాడి సుధాకర్, శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

## టిఎన్ఎంవిఎస్ ఆధ్వర్యంలో ఘనంగా ఎంపీ జన్మదిన వేడుకలు



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 16, ప్రజాపాలన :తెలంగాణ నేతకాని మహర్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు సాయిని ప్రసాద్ నేత ఆద్వర్యంలో పెద్దపెల్లి పార్లమెంట్ సభ్యులు బోర్లకుంట వెంకటేష్ నేత జన్మదిన వేడుకలు బుధవారం హైదరాబాద్ లోని ఎంపి నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఎంపి వెంకటేష్ నేత కరోనా కాలంలో అత్యవసర వైద్యానికి కావలసిన అధునాతన అంబులెన్సు అందించిన తీరును ప్రశంశించారు భవిషత్తులో మరింత ఉన్నత పదవులను అలంకరిస్తూ ప్రజలని సేవచేసే ఆయురారోగ్యాలను అందించాలని వారు కోరారు.ఈ కార్యక్రమం లో హైకోర్టు న్యాయవాదులు రత్నం రాజేష్ నేత నేతకాని విద్యార్థి సంగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కామెర రామకృష్ణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బోర్లకుంట రాజేష్ దుర్గం అంబెద్కర్ బోర్లకుంట దీపక్ కుమార్ బోర్లకుంట ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## యూజీడీ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపం




జిన్నారం, జూన్ 16, ప్రజాపాలన ప్రతినిధి:జిన్నారం గ్రామం లో మండల రెవెన్యూ ఆఫీస్ పక్కన గల కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడి) నిర్మాణం పనుల్లో ఎలాంటి నాణ్యత పాటించకుండా డ్రైనేజీ మ్యాన్హోల్స్ కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా నిర్మాణం చేపడుతున్నారని బీజేపీ నాయకులు ప్రతాప్ రెడ్డి, రాజిరెడ్డి,రమేష్ అన్నారు.వారు మాట్లాడుతూ డ్రైనేజి నిర్మాణంలోను మ్యాన్హోల్స్ నిర్మాణంలో పూర్తి అవకతవకలు జరుగినట్లు వారు ఆరోపించారు. దీనికి సర్పంచ్ పూర్తి బాధ్యత వహించి సమాధానం చెప్పాలని బిజెపి నాయకులు ప్రతాప్ రెడ్డి రాజి రెడ్డి రమేష్ ముదిరాజ్ డిమాండ్ చేశారు.

## అసభ్యకర పదజాలం తో దూషించిన వ్యక్తిని శిక్షించాలి



పరిగి16 జూన్ ప్రజాపాలన ప్రతినిధి : వికారాబాద్ జిల్లా దోమ మండల పరిధిలోని దిర్సంపల్లి గ్రామంలో పంచాయతి సెక్రటరీ గా విధులు నిర్వహిస్తున్న మొగులయ్య పై అదే గ్రామానికి చెందిన ఈ సత్యయ్య అనే వ్యక్తి అసభ్యకర పదజాలం తో పంచాయతి సెక్రటరీ ని దారుణంగా దూషించడం జరిగింది. కావున ఇతనిపై చట్టపరమైన తగు చర్యలు తీసుకోవాలని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు మరియు ఎంపీవో సురేష్ దోమ పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం ఎంపీవో సురేష్ పంచాయతి కార్యదర్శులు పాల్గొనడం జరిగింది.

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ని కలిసిన మధిర న్యాయవాదులు



మధిర ప్రజా పాలన ప్రతినిధి 16వ తేదీ మున్సిపాలిటీ మధిరమధిర కి సబ్ కోర్టు మరియు నూతన కోర్టు నిర్మాణానికి కృషి చేయాలని విజ్ఞప్తి ఈరోజు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకట రమణ గారిని హైదరాబాదులో రాజ్ భవన్ గెస్ట్ హౌస్ నందు మధిర కోర్టు న్యాయవాదులు కలిసి మధిర కోర్టుకు సబ్ కోర్టు మరియు మధిర కోర్టు పురాతనమైనది కావున కోర్టు కొత్త నూతన భవనానికి %ఋఖఅష్ఱఅశీఅ% చేయవలసిందిగా మెమోరాండం ఇవ్వడం అయిన, ప్రధాన న్యాయమూర్తి గారు మధిర కోట్లు సమస్యల గురించి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు భైరవభట్ల శ్రీనివాసరావు సీనియర్ న్యాయవాదులు వాసిరెడ్డి వెంకటేశ్వరరావు వాసంశెట్టి కోటేశ్వరరావు ,%చీఖఎబతీఅ% జనార్ధనరావు, %సఅతీఅయిఖశ్రీఖ% జగన్మోహన్రావు, చింతల గోపాల్ నెల్లూరు రవి తదితరులు పాల్గొన్నారు...

## బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం..

(మొదటి పేజీ తరువాయి)

వాతావరణ శాఖ తెలిపింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం తెలుగు రాష్ట్రాల్లో మరో మూడు రోజుల పాటు ఉండనుందని, దీంతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది.కొన్ని ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఈ రోజు రేపు ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు (ఈదురు గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో) కూడిన వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. ఈ రోజు రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 7 మీ.మీ నుంచి 13 మీ.మీ వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. అత్యధికంగా పెద్దపల్లి జిల్లాలో నమోదైంది. ఆదిలాబాద్, కుమరంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో భారీగానే వర్షపాతం నమోదైంది.

## దేశంలో తొలిసారిగా .. గ్రీన్ ఫంగస్ కేసు నమోదు!

(మొదటి పేజీ తరువాయి)

ఉపిరితిత్తుల్లో 90శాతం ఇన్ఫెక్షన్ జరిగిందని, ఆ తర్వాత అతన్ని చార్టర్డ్ విమానం ద్వారా తరలించగా.. ఇప్పుడు హిందూజా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సదరు వ్యక్తి సుమారు ఒకటిన్నర నెలల క్రితం నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఊపిరితిత్తుల్లో చీము నిండి ఉందని, దాన్ని తొలగించేందుకు చాలా ప్రయత్నాలు చేసినా విజయవంతం కాలేదని తెలిపారు. చికిత్స సమయంలో, రోగిలో వివిధ రకాల లక్షణాలు గమనించామని, అదే సమయంలో అతనికి జ్వరం 103 డిగ్రీల కంటే దిగువకు చేరలేదని వైద్యులు తెలిపారు. గ్రీన్ ఫంగస్ ఊపిరితిత్తులకు వేగంగా సోకుతోందని, దీనిపై మరింత దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## కొత్త ఉద్యోగులకు న్యాయం చేయాలి




పరిగి 16 ప్రజాపాలన ప్రతినిధి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పీఆర్సీ లో 2018 తర్వాత నియామకం అయిన వారికి వర్తించేలా చూడాలని ఉద్యోగులు కొరారు. ఈ మేరకు పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్ కి స్థానిక ఉపాధ్యాయులు వినతి పత్రం అందజేశారు. ముఖ్యమంత్రి దృష్టికి ఈ విషయం తిసుకెళ్తానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం నాయకులు యాదయ్య, ముదస్సిర్ మాట్లాడుతూ టీఅర్టీ 2017 ద్వారా నియమాకం అయినప్పటికీ 2019 అక్టోబర్ లో పోస్టింగ్ ఇచ్చారని, వాస్తావాని 2017 లో నియామకం జరగాల్సి ఉందని, అధికారుల అలసత్వం వల్ల రెండు సంవత్సరాల సర్వీసు నష్టం జరిగింది అని వివరించారు. ఇప్పుడు పీఆర్సీ తో మల్లి సర్వీస్ మొత్తం 30 లక్షలు నష్టం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన మాకు స్వరాష్ట్ర ఫలాలు మాత్రం దక్కడం లేదు అని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 50 వేల మంది ఉద్యోగులకు పీఆర్సీ ఫలాలు అందడం లేదు అన్నారు. మానవతా దృక్పథంతో ప్రభుత్వం పీఆర్సీ ఫలాలు అందరికీ అందేలా చూడాలని ఉద్యోగుల తరుపున డిమాండ్ చేశారు. ప్రభుత్వ%శీ% వెంటనే స్పందించి మాకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చైతన్య, మధుసూదన్, అన్వర్, ఖిజర్, సాయి, అక్బర్, ముక్తార్, సర్ధార్, శివా కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలి:మాజీ ఎంపీ రాథోర్ రమేష్



జన్నారం జూన్ 16 ప్రజా పాలన ప్రతినిధి బిజెపి పార్టీ ని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని ఆదిలాబాద్ మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ కోరారు. రమేష్ రాథోడ్ బీజేపీలో చేరిన సందర్భంగా బుధవారం మండలానికి ఆయనకు బిజెపి శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షిస్తున్నాయి అందుకే బిజెపి ప్రభుత్వాన్ని బిజెపి పార్టీ ని బలోపేతం చేయాలని సూచించారు. తాను గతంలో ఎమ్మెల్యే గాను ఎంపీ గాను ప్రజలకు ఎన్నో సేవలు చేశానని తనను మండల ప్రజలు ఆశీర్వదిస్తారని కోరుతున్నానన్నారు.

## పెండింగ్ లో ఉన్న అక్రిడేషన్లు జారీ చేయాలి



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 15 (ప్రజా పాలన):కేబీ ఆసిఫాబాద్ జిల్లా లో పెండింగ్ లో ఉన్న అక్రిడేషన్ కార్డులు జారీ చేయాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం టీయూడబ్ల్యూజే(ఐ జే యు) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ జిల్లా కలెక్టర్ ను కోరారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్ రాజ్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రహమాన్ మాట్లాడుతూ జిల్లాలో అక్రిడేషన్ కార్డులు కొన్ని పెండింగ్లో ఉండటంతో వర్కింగ్ జర్నలిస్టులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ క్లిష్ట సమయంలో జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు ఉండకపోవడంతో ప్రభుత్వ పరంగా జర్నలిస్టులు నష్టపోతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చామన్నారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ రాహుల్ రాజ్ అక్రిడేషన్ ల జారీ విషయంలో డి పి ఆర్ ఓ తో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్ గౌడ్, టీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ జమీల్, పాత్రికేయులు అబ్దుల్ హన్నన్, వడ్లూరి సురేష్ లు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల లక్ష్యాలను అన్ని శాఖల సమన్వయంతో పూర్తి చేయాలి

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్





మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 16, ప్రజాపాలన :రాష్ట్రంలో ఆయా జిల్లాల వారిగా కేటాయించిన అభివృద్ధి పనుల లక్ష్యాలను సంబంధిత శాఖల సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్కుమార్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఉన్నత అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమీషనర్లు, వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, జిల్లా గ్రామీణాభివృద్ధి, జిల్లా పంచాయతీ అధికారులతో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పల్లెప్రగతి, పట్టణాలను ఆధునీకరించడం కోసం పట్టణ ప్రగతి కార్యక్రమాల పెండింగ్ పనులను వేగవంతం చేయాలని కోరారు., లే-అవుట్ భూములను క్రమబద్ధీకరించా లని, డంపింగ్ యార్డులు, వైకుంఠధామం (స్మశానవాటిక) పనులతో పాటు పారిశుద్ధ్యం పనులు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. అంతర్గత మార్కెట్, పశు సంవర్ధకశాఖ పనులు ప్రణాళికబద్ధంగా చేయాలని పేర్కొన్న ఆయన వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, అంటు వ్యాధులు ప్రబలకుండా త్రాగునీటి విషయంలో ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామాలలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పనులపై పర్యవేక్షిస్తూ పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అన్నారు. తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా ఆయా శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడంతో పాటు ట్రీ గార్డ్స్ ఏర్పాటు చేసి పరిరక్షించాలని తెలిపారు. హరితహారం కార్యక్రమం కోసం నర్సరీలలో మొక్కల పెంపకంతో పాటు బయో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో హరితహారం కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు కూరగాయలు, మాంసం విక్రయ మార్కెట్లను పర్యవేక్షించాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భారతి హొళికేరి మాట్లాడుతూ జిల్లాలో ఈ సంవత్సరం హరితహారం లక్ష్యాలను పూర్తి చేయడం జరిగిందని, 2021-22 సంవత్సరానికి గాను ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో దాదాపు డంపింగ్ యార్డులు, వైకుంఠధామాలు పూర్తి చేయడం జరిగిందన్నారు. వర్షాకాలం సందర్భంగా గ్రామాలలో క్లోరినేషన్ తో పాటు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన వైద్య సేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కొవిడ్-19 వ్యాక్సినేషన్ ప్రక్రియ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి. శేషాద్రి, జిల్లా అటవీ అధికారులు, జిల్లా పంచాయతీ అధికారి నారాయణరావు, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి సుబ్బారాయుడు, పంచాయతీరాజ్ ఈ.ఈ. ప్రకాష్, రోడ్లు, భవనాల శాఖ ఈ. ఈ. రాము, మున్సిపల్ కమీషనర్లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లిలోని నెహ్రూ నగర్, గోపి నగర్ ముంపు, లోతట్టు ప్రాంతాల్లో బీజేపీ నాయకుల పర్యటన



శేరిలింగంపల్లి, ప్రజాపాలన ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర బీజేపీ పార్టీ పిలుపు మేరకు బుధవారం శేరిలింగంపల్లి 106 డివిజన్ బీజేపీ అధ్యక్షులు రాజు శెట్టి కురుమ అధ్వర్యంలో నెహ్రూ నగర్, గోపినగర్ లలోని ముంపు, లోతట్టు ప్రాంతాలను పర్యటించి, రానున్న వర్షం కాల వరదల దృష్యా ప్రజలను అప్రమత్తం చేసి తగిన జాగ్రతలు పాటించాలని, దురదృష్టవశాత్తు ఇల్లు నీట మునిగితే వారికి తాత్కాలిక పునరావాసం కల్పిస్తాం అని హామీ ఇవ్వడం జరిగింది. అలాగే బస్తీ లోని రోడ్లు, డ్రైనేజ్, తాగు నీటి సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు, నెహ్రూ నగర్ లో రోడ్లు సరిగా లేవని, చాలా కాలంగా రోడ్ల మీద డ్రైనేజ్ పొంగి పొర్లుతున్నాయిని టీ.అర్.ఎస్ నాయకులకు ఎన్ని సార్లు పిర్యాదు చేసిన పట్టించుకునే నాధుడే లేదని స్థానికులు వాపోయారు, డ్రైనేజ్ వల్ల దుర్గంధం, అనేక వ్యాధులు సోకుతున్నాయని తమ భాధను వ్యక్తం చేశారు. ఈ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరించే ప్రయత్నం చేస్తామని బీజేపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేవైఎం నాయకులు నీరటి చంద్ర మోహన్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్య కుర్మ, ఉపాదక్ష్యులు బాలరాజు, కోశాధికారి పి. కౌసల్య, భీమాని విజయ లక్ష్మి, భీమాని సత్యనారాయణ ముదిరాజ్, సిద్దు కురుమ, నీలకంఠ రెడ్డి, స్వాతి, పౌల్, సాయి యాదవ్ మరియు స్థానికులు పాల్గొన్నారు.

## పరిసరాలు శుభ్రంగా ఉంటే మనం ఆరోగ్యంగా ఉంటాం: సర్పంచ్ పుల్లమ్మ..



పాలేరు జూన్16 ప్రజా పాలన ప్రతినిధి :నేలకొండపల్లి ప్రతి ఒక్కరూ పరిశుభ్రత ను పాటించాలని కోనాయిగూడెం సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ సూచించారు. మండలంలోని కోనాయిగూడెం పంచాయతీలో సైడ్ కాలువ లో షిల్ట్ ను తొలిగించే కార్యక్రమం ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ పనులు ముందస్తుగా చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటి వద్ద పారిశుద్ధ్యం పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని ఇంటి చుట్టు శుభ్రంగా ఉంటేనే మనం మంచి ఆరోగ్యంగా ఉంటామని అని సూచించారు. ఇంట్లో నీటి నిల్వలు ఉంచకుండా చూడాలని అన్నారు. ఆరోగ్యవంతమైన కుటుంబాల కోసం ప్రతి కుటుంబం తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సైడ్ కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ ను చల్లించే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వడ్లమూడి నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి బోళ్ల వీరబాబు, పంచాయతీ సిబ్బంది బొడ్డు . ఆంజనేయులు. కస్తాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## హిమాచల్ ప్రదేశ్ గవర్నర్.. జైహింద్ కుటుంబాన్ని పరామర్శించారు



బాలపూర్, జూన్ 16, ప్రజాపాలన ప్రతినిధి: మృతిచెందిన బండారి జైహింద్ కుటుంబాన్ని పరామర్శించి, ఏ అవసరం వచ్చినా తనను సంప్రదించాలని హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్ గూడా నంది హిల్స్ కాలనీలో గత నెల (25/05/2021) బండారి జైహింద్ మృతి చెందిన సందర్భంగా ఆ కుటుంబ సభ్యులందరిని హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ తో పాటు కలిసి స్థానిక బిజెపి నేతలు పరామర్శించారు. బండారి జైహింద్ చిత్రపటానికి నివాళులు అర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని మనస్పూర్తిగా అదే విధంగా కుటుంబ సభ్యులందరికీ మనోధైర్యం ఇవ్వాలని ప్రతి ఒక్కరు కోరుకున్నారు. అనంతరం హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ మాట్లాడుతూ..... స్థానికంగా ఉండే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇన్చార్జి అందెల శ్రీరాములు యాదవ్ ను ఆ కుటుంబానికి బాధ్యతగా ఉండాలని సూచించారు. కుటుంబ సభ్యులందరికీ ఏ ఆపద , (అవసరం) వచ్చినా తనను సంప్రదించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షులు గుర్రం మల్లారెడ్డి, రాష్ట్ర నాయకులు కడారి జంగయ్య యాదవ్, బిజెపి సీనియర్ నాయకులు మాజీ సింగిల్విండో చైర్మన్ కోలన్ శంకర్ రెడ్డి, సామ సంజీవరెడ్డి, బడంగ్ పేట్ మీర్ పేట్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు చెరుకు పల్లి వెంకటరెడ్డి, పెండ్యాల నరసింహ్మా, ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్ రెడ్డి, కార్పొరేషన్స్ కార్పొరేటర్లు మాధురి వీర కర్ణ రెడ్డి, జెనీగా పద్మ ఐలయ్య యాదవ్, మోడల బాలకృష్ణ, పసునూరి బిక్షపతి చారి, బీజేవైఎం కార్యవర్గ సభ్యులు రామిడి శూర్ణ కర్ణ రెడ్డి, తిరుపతి రెడ్డి సహాయ బిజెపి కార్యకర్తలు, అభిమానులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో ఏటీఎం చోరీ దొంగలు



మధిర జూన్ 16, ప్రజాపాలన ప్రతినిధి:పట్టణంలో ఆర్ వి కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న ఏటీఎంలో 13వ తారీకు రాత్రి రెండున్నర గంటల సమయంలో మాస్కులతో ఉన్న ఇద్దరు వ్యక్తులు ఏటీఎంలో కి చొరబడి ఏటీఎం మిషన్ పగలగొట్టే ప్రయత్నం చేసిన వీడియో ఫుటేజ్ సోషల్ మీడియాలో వైరల్ కావటం ఆ ఎటీఎం కి సంబంధించిన వారు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన గంటల వ్యవధిలోనే మధిర టౌన్ పోలీస్ స్టేషన్ లో ప్రొబేషనరీ ఎస్ఐ గా పనిచేస్తున్న షకీర్ బ్లూ కోట్ కానిస్టేబుల్ రామారావు సహకారం, సమాచారం తో ఏటీఎం చోరీ చేసిన దొంగలను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఏటీఎంలో చోరీ చేసిన దొంగలు మధిర ఎస్సీ కాలనీకి చెందిన వ్యక్తులుగా గుర్తించినట్లు సమాచారం. ఏటీఎంలో చోరీకి ప్రయత్నించిన ఇద్దరు దొంగలను చాకచక్యంగా పట్టుకున్న ప్రొబేషనరీ ఎస్ ఐ షకీర్ ను బ్లూ కోట్ కానిస్టేబుల్ రామారావును మధిర సర్కిల్ ఇన్స్పెక్టర్ ఓ.మురళి అభినందించినట్లు సమాచారం. ఏటీఎం చోరీకి ప్రయత్నించిన వ్యక్తులు గతంలో మధిరలో చిన్న చిన్న దొంగతనాలు చేసినట్లు సమాచారం.

## రైతులకు విత్తన శుద్ధి గురించి అవగాహన కార్యక్రమం



పరిగి జూన్ 16, ప్రజాపాలన ప్రతినిధి: వికారాబాద్ జిల్లా దోమ మండల పరిధిలోని కేశిలమ్మ తండా మూడవ రెడ్యా నాయక్ పొలాన్ని వ్యవసాయ శాఖ- ఆత్మ అధికారులు ప్రదర్శన క్షేత్రంగా ఎన్నుకోవడం జరిగింది ఈ ప్రధాన క్షేత్రం లో భాగంగా పరిగి- 176 రకం కంది విత్తనాన్ని రెడ్యా నాయక్ కి ఇచ్చి విత్తన శుద్ధి యొక్క ప్రాముఖ్యత గురించి రెడ్డి నాయక్ మరియు కేశిలమ్మ తండాకు చెందిన రైతులకు వివరించడం జరిగింది. ట్రై గో డెర్మా వేరిడితో ఒక కిలో విత్తనానికి 10 గ్రాముల ట్రైకోడెర్మా విరిడిగా చిత్తశుద్ధి చేయించడం జరిగింది. ట్రైకోడెర్మా వీరిడితో విత్తన శుద్ధి చేస్తే కంది మొలకలు చనిపోకుండా ఉంటాయని రైతులకు వివరించారు విత్తన శుద్ధి చేయడం వలన కంది మొలకలు ఒక నెల రోజుల పాటు చీడపీడలు రావని వ్యవసాయ అధికారులు వివరించారు విత్తన శుద్ధి చేసుకునే రైతులు ముందుగా శిలీంధ్ర నాశిని తో చేసుకొని తర్వాత కీటకనాశిని తో( ఇన్సెక్షన్ సైడ్స్) దాని తర్వాత రైండో బియ్యంతో చేసుకోవాలి ఈ ప్రధాన క్షేత్రం లో ఆత్మ అధికారులు గణేష్ డి టి ఎం మణికొండ కేస్ ఎల్లమ్మ తండా కు చెందిన రైతులు పాల్గొన్నారు.

## రైతుభీమా చెక్కు అందజేత



పరిగి 16 జూన్ ప్రజా పాలన ప్రతినిధి : వికారాబాద్ జిల్లా దోమ గ్రామానికి చెందిన చాకలి యాదమ్మ 55 అనే రైతు ఇటీవల అనారోగ్యంతో మరణించడం జరిగింది. మృతురాలి కుటుంబానికి రైతు బీమా ద్వారా ఐదు లక్షల రూపాయల చెక్కును కుమారుదు బసప్ప కు జడ్పీటీసీ కె నాగిరెడ్డి బుధవారం ఎమ్మెల్యే నివాసంలో అందజేయడం జరిగింది.

# బెల్లంపల్లిలో కరెంట్ కష్టాలు

బెల్లంపల్లి జూన్ 16 ప్రజా పాలన ప్రతినిధి: రెండవ గ్రేడ్ మున్సిపాలిటీ అయినా బెల్లంపల్లి పట్టణంలో కరెంటు కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు.బెల్లంపల్లి పట్టణం లోని విద్యుత్ శాఖ అధికారుల తీరుపై పట్టణ ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు, రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ చెప్పినట్టు కనురెప్పపాటు కూడా కరెంట్ పోదు అనే మాటలను బెల్లంపల్లి పట్టణ విద్యుత్ శాఖ అధికారుల పనితీరు అపహాస్యం చేస్తున్నాయి, అధికారుల అలసత్వమో ప్రకృతి వైపరీత్యమో ఏమో తెలియదు గానీ పట్టణంలో వేళాపాళా లేకుండా కరెంటు తీసేస్తూ వ్యాపారస్తులకు ప్రభుత్వ, ప్రైవేటు, కార్యాలయాలకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఇదేమని అడిగితే లైన్ లో పనిచేస్తున్నారని, మెయింటెనెన్స్ ఉందని ఏదో ఒక సాకు చెప్పి రోజులో కనీసం పొద్దుట రెండు సాయంత్రం రెండు గంటలు కరెంటు తీసేస్తున్నారని ఇక రాత్రి అయితే కొమ్మ ఊగితే చాలు కరెంటు పోతుంది వర్షం వచ్చినా రాకపోయినా కరెంటు రావడం కష్టమే అనే నిర్ణయానికి ప్రజలు వచ్చారని, రాత్రులు కరెంటు పోతే తెల్లవారేసరికి వచ్చేది నమ్మకం లేదని ఫోన్లు చేసినా సంబంధిత అధికారులు స్పందించడం లేదని అంటున్నారు, ఇలాంటి పరిస్థితుల్లో కరెంట్ బిల్లులు కట్టడం ఎందుకని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే అధికారికంగా కరెంట్ తీసేయడం ఆనవాయితీగా వస్తుంది ఆదివారం రోజుల్లో ప్రొద్దుట 9 గంటలకు నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు మెయింటినెన్స్ ఉందంటూ ప్రకటనలు చేసి ఎనిమిది గంటలకి తీసేస్తూ సాయంత్రం నాలుగైన విద్యుత్ రాకపోవడంతో వినియోగదారులు సిబ్బందిపై తీవ్ర వ్యతిరేకతను తెలుపుతున్నారు, ఏది ఏమైనా బెల్లంపల్లి పట్టణం లోని విద్యుత్ శాఖ అధికారుల పనితీరు సక్రమంగా లేకపోవడంపై ఈ వ్యతిరేకత అంతా స్థానిక ప్రజా ప్రతినిధుల పనితీరుకు అద్దం పడుతుందనీ ప్రజలు ఆరోపిస్తున్నారు, ఇప్పటికైనా విద్యుత్ అధికారుల, ప్రజాప్రతినిధుల పనితీరులో మార్పు రాకపోతే ఈ వ్యతిరేకత ప్రభుత్వంపై పడే అవకాశం ఉందని పలువురు అంటున్నారు. ఈ విషయమై స్థానిక ప్రజా పాలన ప్రతినిధి సహాయక ఇంజనీర్ను ఫోన్లో సంప్రదించ డానికి ప్రయత్నించగా స్పందించకపోవడం కొసమెరుపు.

## ప్రకృతి వనంలో సేంద్రియ పద్ధతిలో కూరగాయల పంటలు



జిన్నారం, జూన్ 16, ప్రజాపాలన ప్రతినిధి: జిన్నారం మండల కేంద్రం లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనంలో సేంద్రియ పద్ధతిలో పండిస్తున్న కూరగాయల పంటలు, బుధవారం రోజు పండించిన కూరగాయలను పఠాన్చెరు నియోజకవర్గ హరితహారం ఇంచార్జ్ ప్రసాద్ రావుకి అందజేసిన వార్డు సభ్యులు గోకర్ శ్రీధర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి , కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, బ్రమేందర్ గౌడ్, తోట నర్సింగరావు, కె. యాదయ్య పాల్గొన్నారు.

## కాకతీయ కమ్మ సేవా సమితి మధిర వారి ఆధ్వర్యంలో బుధ వారం నాడు కరోనా పేషెంట్లకు భోజనం పంపిణీ



మధిర ప్రజా పాలన ప్రతినిధి 16వ తేదీ మధిర మున్సిపాలిటీఈ రోజు దాత విజయ వాడ కు చెందిన నాదెండ్ల రాంబాబు, క్రాంతిక దంపతులు గార్లు కమ్మ సేవా సమితి నేతలు గడ్డం శ్రీనివాసరావు, మల్లాది వాసు, చెరుకూరు నాగార్జున ఆధ్వర్యంలో సేవా సమితి వాలెంటీర్లు మధిర లో వున్న రోగులకు, అలాగే పలు గ్రామాల్లో గల కరొన భాధితులకు , పలు గ్రామాల్లో 150 మందికి భోజనం పంపిణీ చేసారు.ఈ కార్యక్రంము లో మధిర %తీం% సీనియర్ నాయకులు గడ్డం భద్రయ్య, నిడమానూరు వంశీ, సేవా సమితి నాయకులు మెడ వెంకటేశ్వరావు, చలసాని సుబ్బారావు, నరమనేని అనీల్, వాసిరెడ్డి శ్రీను పాల్గొన్నారు.

## నిషేధిత గుట్కాలు, పొగాకు అమ్మితే కఠిన చర్యలు:లక్షట్ పేట సీఐ నారాయణ నాయక్



జన్నారం జూన్ 16 ప్రజా పాలన ప్రతినిధి : మండలంలో నిషేధిత గుట్కాలు కానీ పొగాకు కానీ అమ్మిన వారిపై చర్యలు తీసుకుంటామని లక్షట్ పేట సీఐ నారాయణ నాయక్ హెచ్చరించారు. బుధవారం కేంద్రంలో గల అంబేద్కర్ విగ్రహం సమీపంలో నిషేధిత గుట్కాలు పొగాకు అమ్మ రాదు అనే పోస్టర్ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ నారాయణ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు పొగాకు అమ్మ రాదని అలాంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ ఐ మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.


మాస్టర్ కీ TV
(అంబేడ్కర్ TV)

జై భీం,
మీరు నాయకుడిగా ఎదగాలని అనుకుంటున్నారా...?
మీరనుకున్న వార్తలు రావాలని కోరుకుంటున్నారా...?
పెట్టుబడి లేకుండా ఆదాయం పొందాలని అనుకుంటున్నారా...?
మీరూ మీ అసెంబ్లీ నియోజకవర్గం లో
టీవీ ఛానల్ ఓనర్ గా కావాలని అనుకుంటున్నారా...?
అయితే రండి, కదలి రండీ

బహుజనాభివృద్దే.. దేశాభివృద్ధి అని నిరూపిద్దాం

1. ఈ దేశంలో ఉన్న ఫోర్త్ ఎస్టేట్ (మీడియా రంగం) బహుజనుల సమస్యల మీద ప్రచారం చేయడం లేదని మీ అందరికీ తెలుసు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా విలేఖరులకు సామాజిక కార్యకర్తలకు, అంబేడ్కర్, పూలే సంఘం నాయకులకు, కనీసం 100 మంది తెలిసిన గ్రూపునాయకులకు టీవీ ఛానల్ ప్రతినిధిగా / యజమానిగా అవకాశం ఇవ్వబడును.
2. జీవిత కాలంలో ఆయా అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతినిధిగా / యజమానిగా నియమించబడును.
3. ఆయా ప్రతినిధికి ప్రకటనల ఆదాయం (Advertising Revenue)లో ప్రకటనలపై 40% ఆదాయం ఇవ్వబడును.
4. వార్తలను స్వేచ్ఛాయతంగా ప్రసారం (Telecast) చేసే వీలు కల్పించబడును.

సంప్రదించండి

Tel No: 9849031420 ,9440918143, 94409 18371, 94400 53858, 93473 50692,8008840506, 9440077239, 7798832998, 76600 27678,
Office: Ambedkar TV Channel, 3rd Floor, Dault Plaza, Main Road, Besides Bata Showroom, Lakdi ka pool, Hyderabad - 500004
E- mail : ambedkartvchannel2018@gmail.com www.ambedkartv.org

ప్రజాపాలన

సంపాదకీయం

గురువారం 17, జూన్ 2021

# ప్రధాని ప్రసంగంలో ప్రతిఫలించని సత్యం

ఓటమి ఎదురుకాగానే క్రుంగిపోయేవారు, అస్త్ర సన్యాసం చేసేవారు, రాజకీయనాయకులు కారు. నిజమైన రాజకీయ నాయకులు జయాపజయాలతో సంబంధం లేకుండా రాజకీయ కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉంటారు. ఎన్నికలు సమీపిస్తుంటే వేగంగా పావులు కదుపుతారు. అవతలి పార్టీలో పరిణామాలను గమనిస్తుంటారు. ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీలో ఇలాంటి రాజకీయాలు స్పష్టంగా కనపడేవి. ఏఐసిసి కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శుల గదుల ముందు వందలాదిమంది నిత్యం తచ్చాడుతూ కనపడేవారు. అక్బర్ రోడ్‌లోని పార్టీ కార్యాలయం ఆవరణలో కాంగ్రెస్ నేతలు తెల్లటి పక్షుల్లా వాలుతూ ఉండేవారు. కాని ఇప్పుడు అక్కడ బూడిద రంగు పావురాలు, చెట్లనుంచి రాలిపోతున్న ఆకులు తప్ప మనుషులు కనపడడం లేదు. రాష్ట్రాలనుంచి వచ్చే నేతలకు ఎవర్ని కలుసుకోవాలో ఎవరితో మాట్లాడాలో తెలియదు. పాత కాంగ్రెస్ సంస్కృతికి అలవాటుపడ్డ వారు ఢిల్లీ వచ్చి ఒకటి రెండు రోజులు ఉండి నిరాశగా తిరిగి వెళిపోతున్నారు. భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. పశ్చిమబెంగాల్‌లో అనుకున్న ఫలితాలు రాలేదని, హిందూత్వ కోటలైన అయోధ్య, గోరఖ్ పూర్, మథుర, ప్రయాగ్ రాజ్, వారణాసిలలో ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో పార్టీ పరాజయం చెందిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ, అమిత్ షా ఖంగుతిన్న మాట నిజం కావచ్చు కాని వారు మరుసటి రోజునుంచే దూకుడుగా రాజకీయాలు ప్రారంభించారు. ఎటువంటి రాజకీయ ఎదురుగాలులు వీచినా తన శైలికి భంగం కాకుండా చూసుకునే స్వభావం మోదీది. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని మొదటి రోజునుంచే సమస్యల్లో చిక్కుకునేలా చేసిన తర్వాత బిజెపి నేతల దృష్టి ఉత్తర ప్రదేశ్‌పై మళ్లింది. కరోనా సమయంలో స్వంత పార్టీ ఎంపీలనుంచి, కేంద్ర మంత్రులనుంచి తీవ్రవిమర్శలు ఎదుర్కొన్న ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ అదిత్యనాథ్‌ను వ్యూహాత్మకంగా తమ అదుపులోకి తెచ్చుకున్నారు. ఒక దశలో యోగీ ఆదిత్యనాథ్ తన పదవి కోల్పోతానేమోనని భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సంఘ్ పెద్దలు, పార్టీ నేతలు కలుగ చేసుకున్న తర్వాత యోగీ ఆదిత్యనాథ్ ఢిల్లీ వచ్చి మోదీ, అమిత్ షాలతో సంధి కుదుర్చుకోవాల్సి వచ్చింది. 9 నెలల తర్వాత 2022 ఫిబ్రవరిలో జరిగే ఉత్తర ప్రదేశ్ ఎన్నికల్లో విజయానికి, తన సారథ్యానికి డోకా లేకుండా చేసుకోవడమే కాదు, 2024 ఎన్నికలకు కూడా మోదీ సన్నాహాలు ప్రారంభించారనడంలో అతిశయోక్తి లేదు. మరో సారి హోంమంత్రి అమిత్ షా నివాసం రాజకీయ కార్యకలాపాలకు కేంద్రంగా మారింది. ఆయన నిత్యం పార్టీ నేతలు, ఎంపీలతోనే కాదు, వివిధ రాష్ట్రాల నేతలతో, ముఖ్యమంత్రులతో సమావేశాలు జరుపుతున్నారు. కేంద్రంలో పలువురు మంత్రుల పనితీరుపై సమీక్ష సాగుతోంది. మోదీ తన మంత్రివర్గ టీమ్‌ను పునర్వ్యవస్థీకరిస్తారన్న ఊహాగానాలు ఊపందుకున్నాయి. సరిగా పాలన చేయకపోతే, ఎమ్మెల్యేలలో అసంతృప్తిని అరికట్టకపోతే పదవి కోల్పోవాల్సి వస్తుందని కర్ణాటకలో ముఖ్యమంత్రి యడ్యూరప్పకు కూడా హెచ్చరికలు వెళ్లాయి. బిహార్‌లో తలనొప్పిగా పరిణమిస్తున్న చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ చీలిపోయి మెజారిటీ నేతలు ఎన్డీఏ వైపు మొగ్గు చూపారు. ప్రతి రాష్ట్రంలోనూ బిజెపి కోర్ కమిటీలు క్రియాశీలకంగా పనిచేస్తూ ఆయా రాష్ట్ర పరిస్థితులపై కేంద్రానికి ఎప్పటికప్పుడు నివేదికలు పంపమని ఢిల్లీ నుంచి ఆదేశాలు వెళ్లాయి. అవసరమైన చోట్ల రాష్ట్రాల్లో పార్టీ పదవుల్లో నియామకాలు, మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలు మొదలయ్యాయి. బిజెపి బలహీనంగా ఉన్న రాష్ట్రాల్లో ఇతర పార్టీల నుంచి నేతలను, అసంతృప్తులను ఆకర్షించేందుకు చర్యలు వేగవంతమయ్యాయి. సున్నాకు ఒకటి చేరినా తమకు లాభమేనన్నది బిజెపి ప్రస్తుత విధానంగా కనపడుతోంది. అందులో భాగంగానే టీఆర్ఎస్ నుంచి ఈటల రాజేందర్ నిష్క్రమించగానే వెంటనే బిజెపిలో చేర్చుకునేందుకు రాష్ట్రం నుంచి ప్రతిపాదనలు వెళ్లడం, కేంద్రం ఆమోదించడం వేగంగా జరిగింది. పెద్ద ఎత్తున మందీమార్బలంతో ప్రత్యేక విమానంలో ఢిల్లీ వచ్చిన ఈటల రాజేందర్‌కు ఆయన స్థాయి, అవసరానికి తగ్గ ప్రాధాన్యత లభించింది. ఉత్తర ప్రదేశ్‌లో జితిన్ ప్రసాద కాంగ్రెస్ నుంచి అనేక సార్లు పోటీ చేసి ఓడిపోయి ఉండవచ్చు కాని ఆయన అమిత్ షాను కలిసిన తర్వాతే బిజెపిలో చేరారంటే ప్రస్తుత యుపి రాజకీయాల్లోనే కాదు, బిజెపి రాజకీయాల్లో కూడా జితిన్ ప్రాధాన్యత అర్థం చేసుకోవచ్చు. బిజెపి లాగా మిగతా పార్టీల్లో కూడా కదలికలు మొదలయ్యాయి. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్ వాది పార్టీ నేత అఖిలేశ్ యాదవ్‌ను బహుజన సమాజ్ పార్టీ ఎమ్మెల్యేలు కలుసుకోవడం, పశ్చిమ బెంగాల్‌లో బిజెపి ఉపాధ్యక్షుడు ముకుల్ రాయ్ తన అనుచరులతో సహా మళ్లీ తన స్వంత పార్టీ తృణమూల్‌లో చేరాలనుకోవడం, ఆఖరుకు ఆమ్ ఆద్మీ పార్టీ కూడా గుజరాత్‌లో కాలూనేందుకు సన్నాహాలు చేయడం వంటివి మొదలయ్యాయి. మరో వైపు ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ దేశంలో ప్రత్యామ్నాయ కూటమి ఏర్పాటుపై శరద్ పవార్ లాంటి నేతలతో చర్చలు ప్రారంభించారు. కాని దేశంలో ఇప్పుడు ఏ సానుకూల కదలికలూ లేని పార్టీ ఏదైనా ఉంటే అది తనకు తాను ఘన చరిత్ర ఉన్నదని చెప్పుకుంటున్న కాంగ్రెస్ పార్టీయే అని చెప్పక తప్పదు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ, పార్టీ ప్రధాన కార్యదర్శి స్థాయి నేతలు వెళ్లిపోతున్నా పట్టించుకోలేని పరిస్థితి ఆ పార్టీలో నెలకొన్నది. ఆ పార్టీలో కదలికలు ఏవైనా జరుగుతున్నాయంటే అవి అసమ్మతి స్వరాల లుకలుకలు. పంజాబ్‌లో ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్, మరో నేత నవజోత్ సింగ్ సిధూకు మధ్య 2017 నుంచి ఘర్షణలు జరుగుతున్నప్పటికీ అధిష్ఠానం పరిష్కరించే పరిస్థితిలో లేదు. ఎన్డీఏ నుంచి అకాలీదళ్ వెళ్లిపోవడంతో పంజాబ్‌లో పరిస్థితులు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నప్పటికీ ఈ ఇద్దరు నేతలు బహిరంగంగా తిట్టుకుంటూ పార్టీని బలహీనపరుస్తున్నారు. ఈ లోపు జితిన్ ప్రసాద బిజెపిలో చేరడంతో రాజస్థాన్ నేత సచిన్ పైలట్ మనసు మార్చుకోకుండా అడ్డుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏడాది క్రితం అక్కడ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్‌కూ సచిన్ పైలట్‌కూ మధ్య ఘర్షణలు తీవ్రతరమైనా, వారిద్దరి మధ్య సయోధ్య ఏర్పర్చడంలో అధిష్ఠానం విఫలమైంది. కేరళతో పాటు వివిధ రాష్ట్రాల్లో పార్టీ నేతలు అంతర్గత కుమ్ములాటల్లో సతమతమవుతున్నారు. ఓటమిపై సమీక్షలు లేవు, పార్టీ కార్యకర్తలు నేతలతో రాష్ట్రాల వారీగా సమావేశాలు లేవు. జరగబోయే ఎన్నికల కోసం ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందించగల సత్తా ఉన్న టీమ్ లేదు. కలిసికట్టుగా కార్యాచరణ చేసి పార్టీని బతికించాలన్న తపన గల వారు లేనే లేరు. జనంలోకి వెళితే విశేషాదరణ పొందగల నాయకులు లేరు. ఒకరికి అవకాశం వస్తే మరొకరు కాళ్లు లాగే పీతలు తప్ప నేతలు కాంగ్రెస్‌లో కనపడడం లేదు. దేశ రాజకీయాలు ఇప్పుడు సంధి దశలో ఉన్నాయి. దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక సమస్యలు దుర్భరంగా మారుతున్నాయి. వ్యవస్థలు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాయి. అన్నిటికన్నా దారుణం ఏమిటంటే ప్రతిపక్ష పార్టీలు బలహీనం కావడమే కాదు, భారత దేశంలో వందిమాగధ బృందాలు తప్ప బలమైన పౌర సమాజం అనేది లేకుండా పోయింది. జయప్రకాశ్ నారాయణ్ నుంచి అన్నాహజారే వరకు ఉద్యమాలు నిర్వహించిన దేశమేనా ఇది అన్న ప్రశ్న తలెత్తుతోంది. అధికారంలో ఉన్న వారు పనిగట్టుకుని విమర్శనాత్మకంగా వ్యవహరించే, జవాబుదారీ తనాన్ని కోరే, జరుగుతున్న ఘోరాలను ప్రశ్నించే పౌరసమాజాలు లేకుండా చేశారు. అప్పుడప్పుడు న్యాయస్థానాలు చేసే వ్యాఖ్యలు తప్ప సమాజంలో ఆరోగ్యకరమైన చర్చకు తావు లేకుండా పోయింది. గత వారం జరిగిన జీ–7 దేశాల సమావేశం భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ, మీడియా స్వేచ్ఛ, పౌర సమాజ ప్రాధాన్యత, నియంతృత్వ పోకడల గురించి స్పష్టీకరించింది. మనం ఇప్పుడొక సంక్షుభితమైన దశలో ఉన్నామని, ప్రజాస్వామ్యానికి, స్వేచ్ఛకూ ముప్పు ఏర్పడిందని హెచ్చరించింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే మన ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొన్న ఈ సమావేశంలో ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనపై భారత్ సంతకం చేసింది. నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని, భారత దేశం ప్రజాస్వామ్య విలువలకు, దాపరికంలేని పారదర్శకతకు, వాక్ స్వాతంత్ర్యానికి కట్టుబడి ఉన్నదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా ఈ సమావేశంలో అద్భుతమైన ప్రసంగం చేశారు. కాని భారత దేశంలో జరుగుతున్న దానికీ, ప్రధాని ప్రసంగానికీ మధ్య ఎన్నో వైరుధ్యాలున్నాయని ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా మరునాడే ఖండించింది.

# సైబర్ నేరగాళ్ల వలలో పడవద్దు..

ఇంటర్నెట్ ఆధారంగా జరిగే వ్యక్తిగత, ఆర్థిక, భద్రత పరమైన నేరాలను సైబర్ నేరాలు అంటారు. ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ నేరగాళ్లు ప్రపంచ భద్రతను ప్రమాదంలోకి నెట్టేస్తున్నారు. ఎక్కడో సుదూర దేశాల్లో ఉన్న సైబర్ నేరస్తులు మన నెట్టింట్లో ప్రవేశించి మన బ్యాంకు ఖాతాను ఖాళీ చేస్తుండటం, వ్యక్తిగత ప్రైవసీని దెబ్బ తీస్తుండటం, కంప్యూటర్ వ్యవస్థలను విధ్వంసం చేసి అత్యంత సున్నితమైన సమాచారాన్ని తస్కరిస్తుండటం, సోషల్ నెట్ వర్కింగ్ పేరుతో ఆడవాళ్ల మీద లైంగిక వేధింపులు, ఈవ్ టీజింగ్ తో చెలరేగిపోతుండటం, తదితర సైబర్ నేరాలు అధికమయ్యాయి. సాధారణంగా జరుగుతున్న ప్రాపర్టీ అఫెన్సెస్ కంటే సైబర్ నేరాల తీవ్రత, ప్రభావం అధికంగా ఉంటున్నాయి. సొత్తు చోరీ మరియు నష్టాలు కూడా ఎక్కువగానే ఉంటున్నాయి. భవిష్యత్తులో దేశాల మధ్య యుద్ధాలకు సైబర్ క్షేత్రాలే వేదికలవుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ తరుణంలో ప్రజలందరూ సైబర్ నేరాల స్థితిగతులు, పరిణామాలు, ముందస్తు జాగ్రత్తలు, నివారణ చర్యలపై అవగాహన కల్గి ఉండటం అవసరం. ఇంటర్నెట్ మాధ్యమం ద్వారా ప్రైవసీని భగ్నం చేయడం, బ్యాంకు ఖాతాలను ఖాళీ చేయడం, భద్రతకు ముప్పు కలిగించడం చేస్తున్నారు. ఈ నేరాలకు పాల్పడేవారెవరో గుర్తించడం అత్యంత కష్టమయిన పని అవుతున్నది. వీటి తీవ్రతకు ప్రపంచ దేశాలన్ని వణికిపోతున్నాయి. ఆన్‌లైన్ లావాదేవీల వ్యాపారమూ వేగంగా విస్తరిస్తోంది. అయినా సైబర్ నేరాలపట్ల ప్రజలకు ఉన్న అవగాహన కూడా బాగా తక్కువగానే ఉంది. లాటరీ తగిలిందని తప్పుడు మెయిల్ పంపించి పెద్దయెత్తున డబ్బు కొల్లగొట్టే మోసాల సంఖ్య మరియు కోట్ల రూపాయలు విలువ చేసే లాటరీ కలిసిందని చెప్పగానే వెనకాముందు ఆలోచించకుండా అడిగినంత డబ్బు మాయగాళ్ల ఖాతాల్లో డిపాజిట్ చేసేవారి సంఖ్యకూ కొదవలేకుండా పోయింది. విలువైన పేటెంట్లు చోరీ చేయడం, ఆర్థిక సంస్థలను మోసం చేయడం, క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డుల నుంచి చోరీ, తదితర సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఓటీపీ, జాబ్, ఇ–మెయిల్, లక్కీ డ్రా, లాటరీ ఫ్రాడ్స్ జరగడం ప్రస్తుత పరిస్థితుల్లో సర్వసాధారణమైంది. వీటితో ప్రజలు నిత్యం మోసపోతూనే ఉన్నారు. ఇటీవలి కాలంలో సైబర్ నేరగాళ్లు బ్యాంకు వివరాలు, ఆధార్ అనుసంధానం చేయాలని, బ్యాంకు అకౌంట్ నెంబరు, ఓటిపి మొదలయిన వివరాలు అడిగి తెలుసుకుని బ్యాంక్ అకౌంట్ లో ఉన్న డబ్బులు ఖాళీ చేస్తున్నారు. అదేవిధంగా ఫేస్బుక్ పేరుతో మీకు తెలిసిన వారి పేరు మీద నకిలీ అకౌంట్ తయారు చేసి ఫేస్బుక్ మెసెంజర్ ద్వారా అర్జంటుగా డబ్బు అవసరం ఉందని డబ్బు పంపమని ఫోన్ పే, గూగుల్ పే ద్వారా పంపమని కోరుతున్నారు. అటువంటి వాటికి స్పందించకుండా ఉండటమే మంచిది. మీకు తెలిసిన వారు అయితే ఫోన్ లో మాట్లాడి నిర్ణయం తీసుకోవాలి. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా బ్యాంకు సంబంధిత వివరాలు పుట్టిన తేదీ, డెబిట్ కార్డు నెంబర్, యూజర్ ఐడీ, పాస్ వర్డ్, డెబిట్ కార్డు పిన్, సివివి, ఓటిపి ఇతరులకు చెప్పకూడదు. బ్యాంకు, ఆర్బీఐ, ప్రభుత్వ కార్యాలయాలు, పోలీసులు, కేవైసి అథారిటీ పేరుతో వస్తున్న ఫోన్ కాల్స్ తో జాగ్రత్తగా ఉండాలి. ప్లేస్టోర్ నుంచి కాకుండా, టెలిఫోన్ కాల్స్ లేదా ఈ–మెయిల్ ఆధారంగా ఏ మొబైల్ యాప్ ను డౌన్ లోడ్ చేసుకోవద్దు. ఈ–మెయిల్స్, ఎస్ఎంఎస్, ఇతర సోషల్ మీడియా ద్వారా వచ్చిన అపరిచిత ఆఫర్లకు స్పందించకూడదు. కరోనా సమయంలో సైబర్ నేరాలు, ఆన్‌లైన్‌లో మోసాలు పెరుగుతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు హెచ్చిస్తున్నారు. కరోనా విజృంభిస్తున్న సమయంలో వర్క్ ఫ్రమ్ హోం(ఇంటి నుంచి ఉద్యోగాలు) చేసే ఉద్యోగులు జాగ్రత్తలు పాటించాలి. ఫేక్ ఐడీలు, ఫేక్ వెబ్‌సైట్‌లతో ఆన్‌లైన్‌లో ఉద్యోగాలు చేసే వారిని సైబర్ నేరస్థులు మోసాలకు గురి చేస్తున్నారు. మాస్కులు తక్కువ రేట్లకు అమ్ముతామని, ఓఎల్ఎక్స్‌లో తక్కువ రేటుకు వాహనాలు విక్రయిస్తామని, కారు, బైక్, ఫ్రిజ్‌లు లక్కీడిప్ లాటరీలు వంటి ఆన్‌లైన్ మోసాలు ఎక్కువవుతున్నాయి. లాక్‌డౌన్ నేపథ్యంలో ఆన్‌లైన్ మోసాలకు అడ్డూ అదుపులేకుండా పోయింది. కొత్త కొత్త మార్గాల్లో కేటుగాళ్లు అమాయకులను స్మార్ట్‌గా మోసం చేస్తున్నారు. దీంతో మరింత అప్రమత్తమైన తెలంగాణ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మహిళలు, పిల్లల కోసం సురక్షితమైన సైబర్ ప్రపంచం లక్ష్యంగా నెల రోజుల పాటు జరిగే ఆన్‌లైన్ ప్రచారం 'సైబ్ హర్' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. తెలంగాణ మహిళా భద్రతా విభాగం నిర్వహిస్తున్న 'సైబ్ హర్' ప్రచారానికి యునిసెఫ్ ఇండియా అవసరమైన సహకారాన్ని అందిస్తోంది. ఆన్‌లైన్ ముప్పు, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి మహిళలు, పిల్లలకు అవగాహన కల్పించడమే దీని ప్రధాన ఉద్దేశ్యం. సైబర్ నేరాలు జరిగే తీరు, జాగ్రత్తగా ఉండాల్సిన చర్యల గురించి ఇంటర్నెట్ వినియోగదారులకు మరింత అవగాహన కలిగించేలా ఈ కార్యక్రమం చేపడుతున్నారు. కాబట్టి నేడు ప్రజలు సైబర్ నేరాల బారిన అవగాహన కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలి.

**– వాసిలి సురేష్**
**9494615360**

## చే .. మళ్లీ రా!

పెద్ద ఘటములకెసరు పెడుతూ
వియత్నాంలను కూడగడుతూ
నిప్పురవ్వతో మొదలుపెట్టీ
సర్పయాగం పూర్తి చేసెద
శత్రుశేషం లేని చోటున
ప్రజల రాజ్యం నిర్మిస్త చూడమని
మాట ఇచ్చీ, ఆశ పెట్టీ
అకస్మాత్తుగ మాయమయ్యావు
బొలివియాలో అడవి దారిన
మారుమూలన మాటు కాసీ
కాటు వేసెను, విషం కక్కెను
వేయిపడగల శత్రు సర్పం
మిత్రులంతా ఒక్కరొక్కరె
కళ్లముందే కుప్పకూలగ
లా హిగ్వేరా స్కూలు గదిలో
మూగబోయెను ప్రజావాణి
కవిని కాలేకపోయిన
క్రాంతికారుణ్ణి నేననీ
నీకు నువ్వే చెప్పుకున్నా
నీదు గానం విశ్వవ్యాప్తం
కోటి దరువుల పలవరింపుగ
ప్రతి నోటా ఒకే మాట
'ఎర్నెస్టో చే గెవారా!
మరొక్కసారి మా మధ్యకు రావా?



## ఉపాధ్యాయులూ.. వారియర్సే !

ప్రభుత్వ ఉపాధ్యాయులని ఫ్రంట్ లైన్ వారియర్స్ గా గుర్తించమని ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఉపాధ్యాయులకి వ్యాక్సిన్ వేయడం ద్వారా విద్యా బోధనకి ఆటంకం కలగకుండా చూడవచ్చని యూనిస్కో తెలిపింది. ఒకప్పుడు ఉపాధ్యాయులు బోధన,ఎన్నికలు,జనాభా లెక్కలు వంటి విషయాలకు పరిమితము అయ్యేవారు. ఈనాడు సర్వశిక్షా అభియాన్,రాష్ట్రమిక శిక్షా అభియాన్,ఇపుడు ఈ రెండు కలిసి సమగ్ర శిక్షా అభియాన్ గా రూపొందిన దగ్గరనుంచి ప్రభుత్వాలు పాఠశాలల్లో పలు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాయి. ఒకప్పుడు చాక్ పీస్, డస్టర్ వంటివి కొనడానికి కూడా ఉపాధ్యాయులు తమ సొంత డబ్బుని ఖర్చు పెట్టేవారు. ఇప్పుడు పాఠశాలలకి నిధులు మంజూరు అవుతున్నాయి. ప్రభుత్వాలు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయి. ఇందులో ఉపాధ్యాయులు కూడా భాగస్వామ్యులు అవుతున్నారు. వీరికి అనేక ఇతర రంగాలతో కూడా అనుబంధం ఉంటుంది. కరోనా కాలంలో ప్రభుత్వం చెప్పకపోయినా పలు ఉపాధ్యాయ సంఘాలు ప్రజలకి నిరంతరం సేవలు అందిస్తున్నాయి. కొన్ని జిల్లాల్లో అధికారకంగానే వీరు విధుల్లో పాల్గొన్నారు. నాడు నేడు పనులని విజయవంతంగా చేస్తున్నారు. ప్రభుత్వం సరఫరా చేసే కందిపప్పు, బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఇటీవల తెలుగు రాష్ట్రాలలో జరిగిన పలు ఎన్నికల్లో పాల్గొన్నారు. ప్రస్తుతం ఆన్ లైన్ తరగతులని విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యా కానుక కిట్లు పంపిణీకి వీరు సిద్ధంగా ఉన్నారు. ప్రభుత్వం విద్యకి సంబంధించి ఏ సర్వే చేపట్టినా వీరు చేస్తున్నారు. వాయిదా పడిన జనాభా లెక్కలని రేపు వీరే చేస్తారు. మహారాష్ట్రలో కొన్ని ప్రాంతాల్లో ఉపాధ్యాయులే టీకా ఆవశ్యకత గురించి ప్రచారం చేశారు. మరికొంతమంది ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా కరోనా నియంత్రణ గురించి ప్రజలకి అవగాహన కల్గిస్తున్నారు. ఈ కార్యక్రమాలు చేసేటప్పుడు వీరు ప్రజలతో మమేకం అవాల్సి ఉంటుంది. పాఠశాలలు పనిచేసే సమయంలో పాఠాలు చెప్పేటప్పుడు కూడా విద్యార్థులతో వీరు చాలాసేపు గడపాల్సి ఉంటుంది. పిల్లలపై కరోనా ప్రభావం తక్కువేనని వైద్య నిపుణులు చెబుతున్నారు. గ్రామాల్లో ప్రజలకి కరోనా గురించి మరికొంత అవగాహన కల్పించాలి. పిల్లల నుంచి ఉపాధ్యాయులకు లేదా ఉపాధ్యాయులనుండి పిల్లలకి కరోనా సోకినా ప్రమాదమే. అందువల్ల ఉపాధ్యాయులకి వ్యాక్సిన్ వేస్తే వారు విధులకు ఆత్మవిశ్వాసంతో హాజరౌతారు. పరీక్షలు నిర్వహిస్తే వీరు అక్కడ కూడా డ్యూటీ చేయాల్సి ఉంటుంది. పరీక్షల అనంతరం పేపర్లు దిద్దాల్సి ఉంటుంది. ఇందుకోసం వీరు రకరకాల ప్రాంతాల్లో ప్రయాణించాలి. ఉపాధ్యాయులు ఎప్పుడూ వారియర్సే. ఎందుకంటే వైద్యులు, నర్సులు, పోలీసులు వంటి ఫ్రంట్ లైన్ వారియర్స్ ని వీరే కాదా తయారుచేసేది. కాకపోతే వారు ముందు ఉంటారు. వారి విజయాల వెనుక ఉపాధ్యాయులు ఉంటారు. అంతకుమించి పెద్దగా వ్యత్యాసం ఏమీలేదు.

**యమ్. రాం ప్రదీప్**
**తిరువూరు,9492712836**

## రెండో రోజు డ్వాక్రా మహిళలకు వ్యాక్సినేషన్



బాలపూర్, జూన్ 16, (ప్రజాపాలన ప్రతినిధి: బాలపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది వారు డ్వాక్రా మహిళలకు వాక్సిన్ కార్యక్రమాని చక్కగా కొనసాగిస్తున్నారని కార్పొరేటర్ అక్కి మాధవి ఈశ్వర్ గౌడ్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని జిల్లెల్గుడా లో ఉన్న చల్లా లింగారెడ్డి ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన వ్యాక్సినేషన్ సెంటర్ లో డ్వాక్రా మహిళలకు కొవిడ్ 19 టికా ను రెండో రోజు చక్కగా ఆర్ పి, పి.హెచ్.సి సిబ్బంది వారు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా అక్కి మాధవి గౌడ్ మాట్లాడుతూ.... నిన్నటి నుండి డ్వాక్రా మహిళలకు వాక్సిన్ కార్యక్రమాన్ని కి ప్రతీ డ్వాక్రా మహిళ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమం లో కార్పొరేషన్ తెరాస అధ్యక్షులు సిద్దల లావణ్య బీరప్ప ,కార్పొరేటర్ జిల్లెల్ల అరుణ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



పరిగి16 జూన్ ప్రజా పాలన ప్రతినిధి : వికారాబాద్ జిల్లా,పరిగి నియోజకవర్గంలోని స్థానిక ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి తన నివాసంలో దోమ మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 7 మంది ఇటీవలే అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన వారికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూపాయలు 6.49 లక్షల రూపాయలు మంజూరు చెహించి బుధవారం లబ్ధిదారులకు స్థానిక ఎమ్మెల్యే మహేష్ రెడ్డి జెడ్పిటిసి నాగిరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసిఆర్ ప్రవేశపెట్టిన పథకాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి అని అన్నారు. ఈ కార్యక్రమం లో కోఆప్షన్ ఖాజాపాష. ఉప సర్పంచ్ గోపాల్ గౌడ్ , జిల్లా శాఖ డైరెక్టర్ యాదయ్య గౌడ్ తెరాస పార్టీ అధ్యక్షులు రాఘవేందర్ రేడ్డి బొంపల్లి ఉప సర్పంచ్ రఫీక్ పాషా.మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## 18 వ డివిజన్ లో సిసి రోడ్డు నిర్మాణ పనులు



బాలపూర్, జూన్ 16, ప్రజాపాలన ప్రతినిధి: దశలవారీగా అభివృద్ధి పనులు పూర్తవుతాయని, కాలనీలో సమస్యలు అడిగి తెలుసుకున్న కార్పొరేషన్ మేయర్. బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్ కార్పొరేటర్ బండారి మనోహర్ ఆధ్వర్యంలో శ్రీ సాయి నగర్ లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం నాడు కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..... కాలనీ వాసులతో కానీలాలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే రోడ్డు పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. మున్సిపల్ నుంచి వచ్చే నిధులను ప్రతి డివిజన్లో దశల వారీగా అభివృద్ధి జరుగుతుందని హామీ ఇచ్చారు. స్థానిక కార్పొరేటర్ మాట్లాడుతూ..... కాలనీ వాసులందరికి ఏ సమస్యకైనా మీకు ఎప్పుడూ ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ బండారి మనోహర్, ఏ.ఈ బిక్కు నాయక్, సుబ్రహ్మణ్యం, అశోక్, రాజ్ కుమార్, వెంకట్, సునీత, హేమలత, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## రేగుంటలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

మల్లాపూర్, జూన్16 (ప్రజాపాలన ప్రతినిధి):ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం అని రేగుంట సర్పంచ్ కుందేళ్ళ నర్సయ్య అన్నారు. స్థానిక నియోజకవర్గం ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ఆదేశాల మేరకు బుధవారం మల్లాపూర్ మండలం రేగుంట గ్రామ పంచాయితీ ఆవరణలో గ్రామ సర్పంచ్ నర్సయ్య గ్రామానికి చెందిన అర్హులైన ఇద్దరికి రూ.22,500 విలువ గల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ ఆర్థిక స్థోమత సరిగ్గా లేక ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ సీఎం రిలీఫ్ ఫండ్ కోసం నమోదు చేసుకున్న అర్హులైన వారందరికీ ముఖ్యమంత్రి చెక్కులు మంజూరు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మండ మల్లారెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు సురకంటి శ్రీనివాస్ రెడ్డి, రెండవ వార్డ్ మెంబర్ లక్ష్మి, నాయకులు కలుసాని రాజన్న, సురకంటి తిరుపతి రెడ్డి, దండికె శ్రీనివాస్, కుందేళ్ళ నడిపి గంగారం, మూడంపెల్లి శ్రీనివాస్, మహిళలు పాల్గొన్నారు.



## ప్రజాసమస్యలపై జోనల్ కమిషనర్ మమతకు వినతిపత్రం ఇచ్చిన జనసేన పార్టీ నాయకులు



కూకట్ పల్లి జూన్ 16, ప్రజాపాలన ప్రతినిధి: జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు నియోజకవర్గం ప్రజాసమస్యలపై బుధవారం జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ వి. మమత కి జనసేన పార్టీ డివిజన్ ప్రెసిడెంట్లు కొల్లా శంకర్, నాగేంద్రబాబు ,వెంకటేశ్వరరావు, మహేష్ , సూర్య, వినతి పత్రం అందజేశారు. గత సంవత్సరం 2020 వచ్చిన వర్షాల వల్ల కూకట్పల్లి నియోజకవర్గంలో ఉన్న కాలువల నుండి వచ్చిన వరద ముంపుతో నియోజకవర్గంలో ఉన్న బాలనగర్, ఫతేనగర్, మూసాపేట్ లో గల కొన్ని లోగట్టు ప్రాంతాలు మునిగిపోయి ప్రజల ఇళ్లల్లో వరద నీరు వచ్చి ఆస్తి మరియు ప్రాణ నష్టము జరిగి చాలా ఇబ్బంది పడ్డారు గత సంవత్సరం మన గ్రేటర్ హైదరాబాద్ లో కాలువలో పడి ఒక బాలిక మరియు ఈ మధ్య ఒక బాలుడు కాలువలో పడి చనిపోయారు రాబోయే రోజులు వర్షాకాలము కనుక నియోజకవర్గంలో బాలానగర్ ( బతుకమ్మ రోడ్డు శోభన కాలనీ భవాని నగర్ ) మూసాపేట్ లో గల కబీర్ నగర్ లో గల కాలువలకు పెన్సన్లు వేయవలెను కాలువలోని నీరు బయుటకు రాకుండా కాలువలను మరమ్మతు చేసి ప్రజల యొక్క ఆస్తులను మరియు ప్రాణాలను కాపాడాలని కొరారు . మూసాపేట్ డివిజన్ లోని కబీర్ నగర్ ప్రాంతంలో నాలా విస్తరణ పనులు పనులను వేగవంతంగా పూర్తి చేయువలసిందిగా కోరుతున్నాం, ఎందుకంటే రానున్నది వర్షాకాలం కాబట్టి పనులకు ఆటంకం కలగకుండా ఉండాలంటే భారీగా వర్షాలు పడే లోపే పనులు పూర్తి చేసుకున్నట్లయితే.. ఈ ఒక్క సమస్య అనేది ఉండదు. అదేవిధంగా కబీర్ నగర్ ప్రాంతంలో ఈ నాళాల పనుల వల్ల మంచినీటి సరఫరా అనేది గత పది రోజుల నుంచి ఆగిపోవడం జరిగింది.. కావున వెంటనే ఆ వాటర్ పైప్ లైన్ల మరమ్మతులు కూడా త్వరగా పూర్తి చేయవలసిందిగా కోరుతున్నాం, అదేవిధంగా కొన్ని బస్తీలలో రోడ్లు సరి లేక వర్షం వచ్చినప్పుడు బురదతో ప్రజలు నడవడానికి మరియు వాహనాలు పోవడానికి చాలా ఇబ్బందిగా ఉంది కాబట్టి మీరు రోడ్ లను మరియు కాలువలను వెంటనే మరమ్మతు చేయించాలని జనసేన పార్టీ తరపున కోరుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కూకట్పల్లి నియోజకవర్గం లోని జనసేన పార్టీ వివిధ డివిజన్ ప్రెసిడెంట్లు మాట్లాడుతూ గత ఏడాది జరిగిన వర్షం వల్ల కూకట్పల్లి నియోజకవర్గం లో ప్రజలు చాలా ఆస్తి నష్టం జరిగినది.. ఒక సంవత్సరం పాటు కాలయాపన చేస్తూ కాలువలను మరియు రోడ్లను ఎటువంటి మరమ్మతు చేయకుండా ఇప్పుడు వర్షాకాలం వచ్చిన సమయంలో ఎమ్మెల్యే గారు కార్పొరేటర్లు మరియు జిహెచ్ఎంసి అధికారులు హడావుడి చేస్తున్నారు అని అన్నారు.. ఇప్పటికైనా నాయకులు, అధికారులు, సీఎం కెసిఆర్ తో సంబంధిత మంత్రులతో మాట్లాడి ముంపు ప్రాంతములోని కాలువలను మరియు రోడ్లను మరమ్మతు చేయవలెనని కోరారు. ఈ సంవత్సరం వర్షాకాలంలో ప్రజల ప్రాణ నష్టం గాని ఆస్తి నష్టం గాని జరిగితే సీఎం కేసీఆర్, సంబంధిత ఎమ్మెల్యే, సంబంధిత మంత్రి, కార్పొరేటర్లు, మరియు సంబంధిత అధికారులే బాధ్యులు అవుతారు అని అన్నారు. లేనిపక్షంలో జనసేన పార్టీ ప్రజల తరపున మా కార్యాచరణ ప్రకటిస్తాం అని అన్నారు.

ఈ కార్యక్రమంలో కూకట్పల్లి నియోజకవర్గ లోని జనసైనికులు గోవర్ధన్, వినోద్ కుమార్, సుదర్శన్ , దుర్గాప్రసాద్ , రాము ,వైకుంఠ రావు ,పవన్ ,కిరణ్ ,సాయి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అనాధలైన చిన్నారులను ఆదుకున్న బిజెపి నేతలు



బాలపూర్, జూన్ 16, ప్రజాపాలన ప్రతినిధి: ప్రజలకు ఎప్పుడు ఆపదా వచ్చిన భాజపా నేతలు అండగా నిలుస్తారని రాష్ట్ర నాయకులు మాజీ సింగిల్విండో చైర్మన్ కోలన్ శంకర్ రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో బాలపూర్ గ్రామం నివాసులైన ఈ మధ్యకాలంలో కరోనా మహమ్మారి వైరస్ నుండి ఒకే కుటుంబంలో ముగ్గురు మృతిచెందిన సంఘటన తెలిసినదిని, అనాధలైన ఆర్రుర్ జయశ్రీ(13), యశ్వందర్ రెడ్డి (11) చిన్నారులకు బిజెపి రాష్ట్ర నేత మాజీ సింగిల్విండో చైర్మన్ కోలన్ శంకర్ రెడ్డి తో పాటు భాజపా శ్రేణులు కలిసి నగదు యాభై ఐదు వేల రూపాయలు (55,000) నెల రోజులకు సరిపడే నిత్యవసర సరుకులు బుధవారం నాడు అందజేశారు. ఈ సందర్భంగా కోలన్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ..... రంగారెడ్డి జిల్లాలోనే బాలాపూర్ కు చెందిన కుటుంబాన్ని కోల్పోవడం చాల విచారకరమని, వారికి తీవ్ర సానుభూతిని ప్రధాని నరేంద్ర మోడీ, బిజెపి పార్టీ తెలుపుతున్నమన్నారు. అనాధలైన పిల్లలకు బిజెపి కేంద్ర ప్రభుత్వం, అనాధలైన వారికి మంచి ఉన్నత విద్యాలయంలో ఉచిత విద్య, అదే విధంగా నెలకు సరిపోయే వారి ఖర్చులకు డబ్బులు, వారు మేజర్ అయిన తర్వాత 10 లక్షల రూపాయలు ఒక్కొకరి పేరుపైన బ్యాంక్ లో డిపాజిట్ చేసి ,భవిష్యత్తుకు వడ్డీ లేని రుణాలను వారికి అందజేయడం జరుగుతుందన్నారు. కరోనా తో కుటుంబాన్ని కోల్పోయిన చిన్నారులందరికీ ఈ పథకాలు వర్తిస్తాయని అన్నారు.అలాగే నరేంద్ర మోడీ భవిష్యత్తులో ఏ కుటుంబము నష్టపోవద్దాని సంకల్పంతో 21 జూన్ నుండి 18 సం లు నిండిన ప్రతి ఒక్కరికీ ఉచితంగా కోవిడ్ టీకా ను దేశ ప్రజలందరికి ఇస్తున్నందుకు, ప్రధానికి ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజలకు ఎపుడు ఆపదా వచ్చిన బిజెపి అండగా ఉంటుందన్నారు, ఈ కార్యక్రమంలో బిజెపి కార్పొరేటర్లు కిసరి గోవర్దన్ రెడ్డి, భీమ్ రాజ్, సోమేశ్వర్, మల్లేష్, శూర్ణ కర్ణ రెడ్డి, జొరల ప్రభాకర్, శేఖర్ రెడ్డీ, మహేందర్ రెడ్డి, గుర్రం వంశీధర్ రెడ్డి, భాజపా శ్రేణులు అభిమానులు పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్ కు ధన్యవాదాలు తెలిపిన జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత బృందం...



జగిత్యాల, జూన్ 16 (ప్రజాపాలన ప్రతినిధి): ముఖ్యమంత్రి కేసిఆర్ కు స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు గౌరవ వేతనాన్ని 30 శాతం పెంచినందుకు బుధవారం రోజున జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పి చైర్ పర్సన్ దావ వసంతసురేష్ ఆధ్వర్యంలో సీఎం కేసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. చైర్ పర్సన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసిఆర్ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు గౌరవ వేతనాన్ని 30 శాతం పెంచినందుకు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. పంచాయతీ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కవిత మరియు ఎమ్మెల్యేలు సంజయ్ కుమార్ విద్యాసాగర్ రావు రవిశంకర్ చెన్నమనేని రమేష్ బాబు జడ్పీ చైర్ పర్సన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు జడ్పీటీసీ సభ్యులు దరిశెట్టి లావణ్య నాగం భూమయ్య పుణుగోటి ప్రశాంతి బత్తిని అరుణ మేడిపల్లి మనోహర్ రెడ్డి కొండపల్కుల రామ్మోహన్ రావు సంగెపు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పార్కు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



పటాన్చెరు, జూన్ 16, ప్రజాపాలన ప్రతినిధి:పటాన్చెరు డివిజన్ పరిధిలోని శాంతి నగర్, ఆల్విన్ కాలనీల పరిధిలో తొమ్మిది లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టదలచిన పార్క్ అభివృద్ధి పనులను పటాన్చెరువు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి బుధవారం ఉదయం ప్రారంభించారు. పటాన్చెరు రామచంద్రాపురం సర్కిల్ పరిధిలోని 3 డివిజన్ల పరిధిలోని పార్కుల అభివృద్ధికి నిధులు కేటాయించినట్లు తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలి

### టీఆర్ఎస్ జిల్లా యువత అధ్యక్షుడు వెంకటేశం గౌడ్



జిన్నారం, జూన్16 (ప్రజాపాలన ప్రతినిధి):జిన్నారం గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా నేడు గురుకుల పాఠశాల సమీపంలో టీఆర్ఎస్ జిల్లా యువత అధ్యక్షుడు వెంకటేశం గౌడ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ గారి ఆశయాలకు అనుగుణంగా గ్రామాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం కేసీఆర్ దార్శనికతవల్లే ఉద్యమంలా హరితహారం సాగుతోంది అని, భవిష్యత్ తరాలకు ఆహ్లాదకర,మానసికొల్లాసం కలిగించే వాతావరణాన్ని అందించాలనే సంకల్పంతోనే హరితహారం కార్యక్రమాని సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్లే రాష్టంలో అటవీ విస్తీర్ణం 24% నుండి 29% శాతానికి పెరిగిందన్నారు. మరో విడత హరితహారం కోసం గ్రామాల్లో నర్సరీల్లో సిద్ధంగా ఉన్నాయి. ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని, మొక్కలు నాటడం మన సామాజిక బాధ్యత అని, మానవాళి మనుగడకు మొక్కే శ్రీరామ రక్ష అని, ప్రకృతి ని మనం రక్షిస్తే ప్రకృతి మనల్ని రక్షిస్తుంది. కావున ప్రతిఒక్కరు తప్పనిసరిగా, విరివిగా మొక్కలు నాటాలని, మొక్కలు నాటడం సామాజిక బాధ్యత మొక్కలు నాటాడమే కాకుండా వాటిని సంరక్షించి పెద్దవి చేసే బాధ్యత తీసుకోవాలని, పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంజీవ,వార్డు సభ్యులు శ్రీధర్ గౌడ్,మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి,నాయకులు బ్రహ్మేందర్ గౌడ్,నర్సింగ్ రావు,చంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వేతనాల పెంపు హర్షణీయం:కోరుట్ల మండల జెడ్పీటీసీ దారిషెట్టి లావణ్య



కోరుట్ల,జూన్ 16 (ప్రజాపాలన ప్రతినిధి):కోరుట్ల పట్టణ0లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జడ్పీటీసీ, సర్పంచ్,ఎంపీటీసీ, వి.ఆర్.ఏ,వి.ఏ.ఓ మరియు మరి కొన్ని శాఖలకు 30 శాతం జీతాలు పెంచు నందున కోరుట్ల జడ్పిటిసి దారిశెట్టి లావణ్య ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ మంత్రి కేటీఆర్,ఎమ్మెల్సీ కవిత, కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు, చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్,ఎంపీపీ తోట నారాయణ,జగిత్యాల జిల్లా రైతు అధ్యక్షుడు చీటి వెంకట్రావు,వివిధ గ్రామాల సర్పంచ్ లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

## ఎస్సి కార్పొరేషన్ లోన్ పత్రాలను అందజేసిన ఎంపీపీ...



సారంగాపూర్, జూన్ 16 (ప్రజాపాలన ప్రతినిధి): సారంగాపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 2018 – 19 ఆర్థిక సంవత్సరంనకు సంబంధించిన ఎస్సి కార్పొరేషన్ నుండి వివిధ పథకాలపై 11 మందికి 50 వేల చొప్పున మంజూర్ కాబడిన ఉత్తర్వులను మండల పరిషత్తు అధ్యక్షురాలు కోల జమునశ్రీనివాస్ జడ్పీటీసీ యం. మనోహర్ రెడ్డి వైస్ ఎంపీపీ సోల్లు సురేందర్ రేచపల్లి ఎంపీటీసీ భూక్యా లావణ్యరాథోడ్ సర్పంచ్ ఎడ్మల జయ తదితరులు అందజేశారు. ఈ కార్యక్రమములో ఎంపీడీఓ జే. పుల్లయ్య ఎంపీవో పి.శశికుమార్ రెడ్డి కార్యాలయ సిబ్బంది కిషోర్ కార్తీక్ పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్‌లో ముందంజ తెలంగాణ రాష్ట్రం

## డ్వాక్రా మహిళలకు వ్యాక్సినేషన్ డ్రైవ్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్చెరు, జూన్ 16, ప్రజాపాలన ప్రతినిధి:కోవిడ్ నియంత్రణలో భాగంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాలవారికి వ్యాక్సినేషన్ డ్రైవ్ నిర్వహిస్తూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ముందంజలో నిలుస్తోందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం పటాన్చెరు పట్టణంలోని జిహెచ్ఎంసి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ లో డ్వాక్రా మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వ్యాక్సినేషన్ డ్రైవ్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటివరకు ఫ్రంట్లైన్ వారియర్స్, హై రిస్కు గ్రూప్స్, 45 సంవత్సరాలు నిండిన వారికి ఉచితంగా వ్యాక్సిన్ అందించడంతో పాటు ప్రైవేట్ ఆస్పత్రిలోనూ వ్యాక్సిన్ అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల మూలంగా కరోనా నియంత్రణలో ఉందని తెలిపారు. ప్రజలందరూ తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. డ్వాక్రా మహిళలందరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# బిసి నోట్‌బుక్

# యూనియన్, రాష్ట్రాల మధ్య సంబంధాలు



## యూనియన్, రాష్ట్రాల మధ్య సంబంధాలు భారత రాజ్యాంగం ఆర్టికల్స్ 245-255

**(శాసనాలను చేయుడంలో పార్లమెంటుకు, రాష్ట్ర శాసనసభలకు ఉన్న అధికార పరిధి)**

**పరిచయం:**

రాజ్యాంగంలోని 11వ భాగంలో మొదటి అధ్యాయంలో "శాసనాధికారాల విభజన" గురించి ప్రస్తావించబడింది. కేంద్ర రాష్ట్రాల మధ్య శాసనపరమైన అధికారాల విభజన గురించి ఇందులో వివరించడమైనది. 245 నుండి 255 ఆర్టికల్స్ ఇందులో ఉన్నాయి. వీటిని అర్థం చేసుకోవడానికి ఈ క్రింది అంశాలు తెలుసుకోవడం అవసరం.

రాజ్యాంగంలోని మొదటి ఆర్టికల్ ప్రకారం భారతదేశంగా పిలవబడే ఇండియా ఒక రాష్ట్రాల యూనియన్ రాజ్యాంగంలో ఎక్కడా కూడా భారతదేశం ఏకకేంద్రమని కానీ, సమాఖ్య అని కానీ లేదు. అయినప్పటికీ, మన రాజ్యాంగంలో సమాఖ్య లక్షణాలు, ఏకకేంద్ర లక్షణాలు రెండూ ఉన్నాయి. కనుక కొంతమంది పండితులు దీని అర్ధ-సమాఖ్య అని మరియు కొంతమంది సహకార సమాఖ్య అని మరియు కొంతమంది బలమైన ఏకకేంద్ర లక్షణాలుగ సమాఖ్య అని వివిధ రకాలుగా వ్యాఖ్యలు చేసారు. మొత్తం మీద భారతదేశ స్వారూప్యంగా "సమాఖ్య" కానీ అంతర్గతంగా ఏకకేంద్రమని చెప్పవచ్చును.

ఒకదేశం ఏకకేంద్రమా లేదా సమాఖ్యనా అని తెలుసుకోవడం కోసం ఈ రెండు తరహా వ్యవస్థల లక్షణాలు ప్రాతిపదికగా తీసుకోవాలి. ఉదాహరణకు అమెరికా సంయుక్త రాష్ట్రాలు (యుఎస్ఏ)ని సమాఖ్యకు మంచి ఉదాహరణకు తీసుకుంటారు. ఇంగ్లాండ్‌ని ఏకకేంద్ర వ్యవస్థకు మంచి ఉదాహరణ. సమాఖ్య వ్యవస్థకి కావలసిన ప్రధాన లక్షణాలు - అధికార విభజన, స్వతంత్ర న్యాయశాఖ, ద్వంద్వ పౌరసత్వం, దృఢ మరియు లిఖిత రాజ్యం మొ॥. ఇక కేంద్ర వ్యవస్థలో లక్షణాలు దీనికి భిన్నంగా ఉంటాయి. భారత రాజ్యాంగంలోని ప్రత్యేకత ఏమిటంటే ఈ రెండు రకాల లక్షణాలు కలిసే, కలవనట్లుగా ఉంటాయి. కనుక, దీనిని ఏకకేంద్ర అని కానీ, సమాఖ్య అని కానీ అనలేము. పైగా మారుతున్న పరిస్థితులను బట్టి, ఇందులో మార్పులు జరిగే అవకాశం ఉంది. ఈ భాగంలో "శాసనపరమైన సంబంధాలు" పఠించడానికి ఈ విషయాలు దృష్టిలో ఉంచుకోవాలి.

కేంద్ర రాష్ట్రాల మధ్య అధికార విభజన గురించి కొన్ని ఆర్టికల్స్ గురించి మనం ఈ భాగంలో తెలుసుకుంటాం. రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్ ద్వారా పార్లమెంట్ మరియు రాష్ట్ర శాసనసభల మధ్య 246వ ప్రకరణ క్రింద అధికార విబజన - కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితా మరియు ఉమ్మడి జాబితా - అని జరుగుతుంది. సాధారణంగా కేంద్ర జాబితాపై కేంద్ర శాసనసభకు రాష్ట్ర జాబితాపై రాష్ట్ర శాసనసభలకు, ఉమ్మడి జాబితాపై కేంద్ర మరియు రాష్ట్ర శాసనసభలకు వాసనాలు చేసే అధికారం ఉంటుంది. భారత రాజ్యాంగంలో కూడా ఇదేవిధంగా ఉన్నప్పటికీ, కేంద్ర శాసనసభకు వివిధ అంశాలలో అధికారం ఎక్కువ ఉంటుంది. కేంద్ర జాబితాపై రాష్ట్ర శాసనసభలకు అధికారం ఉండే ప్రసక్తి లేదు. కానీ, కొన్ని పరిస్థితులలో కేంద్ర శాసనసభకు అనగా పార్లమెంట్‌కు రాష్ట్ర జాబితాలోని అంశాలపై శాసనాలు చేసే అధికారం ఉంది. ఇక ఉమ్మడి జాబితా విషయంలో కేంద్రం శాసనంకు విరుద్ధంగా రాష్ట్ర శాసనసభలు చట్టం చేయరాదు. పైగా, పై మూడుజాబితాలలో లేని అంశాలపై పార్లమెంట్‌కే అధికారం ఉంటుంది. ఈ విధంగా కేంద్ర, రాష్ట్ర సంబంధాలలో కేంద్రందే పై చేయి. 245 నుండి 255 ఆర్టికల్స్ శాసనసబంధాల గురించి వివరిస్తాయి. వీటిలో కొన్ని ముఖ్యమైన ఆర్టికల్స్ ఈ క్రింద ఇవ్వడం జరిగింది. సంక్లిష్టంగా ఉన్న పదాల అర్థం తెలుసుకోవడానికి పై వివరణ ఉపకరిస్తుంది.

1) ఈ రాజ్యాంగానికి లోబడి భారతదేశమంతటా లేక కొంత భాగం మేరకు శాసనాలను చేయు అధికారం పార్లమెంట్‌కు ఉన్నది. రాష్ట్రమంతటా లేక కొంత భాగానికి విస్తరించు శాసనాలను చేయు అధికారం రాష్ట్ర శాసనసభలకు ఉన్నది.

2) పార్లమెంట్ చేయు శాసనపరిధి దేశ సరిహద్దు దాటిన ఆ శాసనం మాన్యతను కోల్పోదు. అంతమాత్రాన ఆ కారణంపై ఆ శాసనం చెల్లకుండా పోదు.

**ఆర్టికల్ 246: పార్లమెంటు, రాష్ట్ర శాసనసభల పరిధిలోని అంశాలు**

1) క్లాజు (2), (3)లలో ఏమి పేర్కొనబడినప్పటికీ, 7వ షెడ్యూలులోని మొదటి జాబితాలో ఉదహరింపబడిన అంశాలపై (కేంద్ర జాబితా) శాసనాలు చేయు అధికారం పార్లమెంటుకు మాత్రమే కలదు.

2) క్లాజు (3)లో ఏమి పేర్కొనబడినప్పటికీ, 7వ షెడ్యూలులోని 3వ జాబితా (ఉమ్మడి జాబితా)లోని అంశాలపై పార్లమెంటు మరియు క్లాజు (1)కి లోబడి ఏదైనా రాష్ట్ర శాసనసభ కూడా శాసనాలను చేయవచ్చును.

3) క్లాజు (1), (2)లలోని నిబంధనలకు లోబడి, 7వ షెడ్యూలులోని రెండవ జాబితా (రాష్ట్ర జాబితా)లోని అంశాలపై శాసనాలను చేయు అధికారం సంబంధిత రాష్ట్ర శాసనసభలకు మాత్రమే ఉంటుంది.

4) రాష్ట్ర ప్రభుత్వాల భౌగోళిక పరిధికి వెలుపల ఉన్న భారతదేశంలోని ఇతర ప్రాంతాలకు సంబంధించి పార్లమెంటు ఎటువంటి శాసనాన్నైనా (రాష్ట్రాల జాబితాలోని అంశాలతో సహా) చేయవచ్చు.

**ఆర్టికల్ 246ఎ: వస్తువులు మరియు సేవల పన్నులకు సంబంధించిన ప్రత్యేక నిబంధనలు**

1) 246, మరియు 254 ఆర్టికల్స్‌లో ఏవిధంగా ఉన్నప్పటికి, వస్తువులు మరియు సేవలపై కేంద్ర ప్రభుత్వం విధించే పన్నులకు సంబంధించి పార్లమెంటు శాసనాలను రూపొందించవచ్చు. అదే విధంగా రాష్ట్రాలలోని వస్తువులు, సేవలపై పన్ను విధింపుకు సంబంధించి, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల శాసనసభలు శాసనాలను రూపొందించవచ్చు. (క్లాజు (2)కు లోబడి).

2) అంతర్ రాష్ట్రీయ వర్తక వాణిజ్యాలలో భాగంగా, జరిగే వస్తువులు, సేవలు లేక రెండింటి సరఫరాలపై శాసనాలను చేసే అధికారం పూర్తిగా పార్లమెంటుకు మాత్రమే ఉంటుంది.

**వివరణ:** ఆర్టికల్ 279(ఎ)లోని క్లాజు (5)లో ప్రస్తావించబడిన వస్తువులు, సేవలపై పన్ను మాత్రం 'వస్తువులు సేవల పన్ను మండలి' సిఫార్సు చేసే తేదీ నుండి అమలులోకి వస్తుంది. (101వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ ఆర్టికల్ అదనంగా చేర్చబడింది.

**ఆర్టికల్ 248: ఏ జాబితాలోనూ లేని అంశాలపై పార్లమెంటుదే అధికారం:**

1) రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితాలో లేని అన్ని అంశములపై శాసనాలు చేయుటలో పార్లమెంటుకు గల ఈ ఆర్టికల్ 246ఎ ఆర్టికల్‌కి లోబడి ఉంటుంది.

2) ఆ క్రమంలో రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితాలో లేని అంశాలపై పన్ను విధించేందుకు అవసరమైన శాసనాన్ని చేసే అధికారం కూడా పార్లమెంటుకే ఉంటుంది. (ఈ ఆర్టికల్‌లోని మొదటి క్లాజు 101వ రాజ్యాంగ సవరణ సదర్భంగా సవరించబడింది).

## కేంద్ర, రాష్ట్ర ఉద్యోగ సర్వీసులు భారత రాజ్యాంగం ఆర్టికల్ 308-323

**పరిచయం:**

భారత రాజ్యాంగంలోని 14వ భాగంలో 16 ఆర్టికల్స్ ఉన్నాయి. ఈ భాగం చిన్నదే అయినా ఎంతో ప్రముఖమైనది. ఇందులోని వివిధాంశాలు కేంద్ర, రాష్ట్ర, ఉద్యోగ సర్వీసులకు సంబంధించినవి. ఏ ప్రభుత్వ వ్యవస్థలోనైనా, ముఖ్యంగా పార్లమెంటరీ వ్యవస్థలో ప్రభుత్వోద్యోగులు ఉక్కు కవచం వంటివారు. వివిధ పోటీ పరీక్షల ద్వారా వీరు ఎంపిక అవుతారు. పరిపాలనా రంగంలో వీరు నిష్ణాతతను కలిగి ఉండాలి. వీరు పదవీ విరమణ వరకు అధికారంలో ఉంటారు. కనుక వీరిని "శాశ్వత కార్యనిర్వాహక వర్గం" అంటారు.

పార్లమెంటరీ తరహా వ్యవస్థలో ఎన్నికలలో మెజారిటీ సాధించిన పార్టీ అధికారంలోనికి వస్తుంది. ఈ విధంగా ఏర్పడిన మంత్రివర్గం పార్లమెంట్‌లో మెజారిటీ ఉన్నంత కాలం మాత్రమే అధికారంలో ఉంటుంది. అనగా వీరి అధికారం శాశ్వతం కాదు. కనుక ఈ కార్యనిర్వాహక వర్గాన్ని తాత్కాలిక కార్యనిర్వాహక వర్గం అంటారు. వీరికి పరిపాలనా విషయాలలో నిష్ణాతత ఉండక పోవచ్చును. కనుక, శాశ్వత కార్యనిర్వాహక వర్గంలోని ప్రభుత్వోదుగులు మంత్రులకు పరిపాలనలో తగు సహాయ, సలహాలు అందజేయాలి. సాధారణంగా మంత్రులు తమ పరిపాలనా విషయంలో అనుభవజ్ఞులై, శాశ్వత ప్రభుత్వోదుగ సలహాలు తీసుకుంటారు. ఈ సందర్భంలో దుర్గాదాస్ బసు "భారత రాజ్యాంగం - ఒక పరిచయం (తెలుగు అనువాదం)లో ఈ క్రింది విధంగా పేర్కొనడం జరిగింది.

"ఈ విధమైన శాశ్వత ప్రభుత్వోదుగులు సహాయంతో నిర్వహింపబడే పరిపాలన గల వ్యవస్థలోని స్వాభావికమైన లోపం ఏమిటంటే ప్రభుత్వాదులు రాను రాను పనిలో జాప్యానికి, కాలయాపనికి అలవాటు పడిపోయి, పరిపాలనను నియమిత క్రమబద్ధ చర్యగా భావిస్తూ కొత్త ఆలోచనలను భాద్యత వహించక పోవడం, శాసనసభకు బాద్యత వహించవలసిన రాజకీయ కార్యనిర్వాహకులు తమ భాద్యత నిర్వహణలో భాగంగా పరిపాలనలో నూతనత్వాన్ని కొనసాగిస్తారు. అయితే, ఈ విధమైన స్వాభావిక లోపాలన్నిటిలో ప్రభుత్వ ఉద్యోగులు, పార్లమెంటరీ ప్రభుత్వ వ్యవస్థకు తప్పనిసరి అవుతున్నారు".

ఈ నేపథ్యంలో 14వ భాగంలోని కొన్ని ముఖ్యమైన ఆర్టికల్స్ అంశాల వచనలు పరిశీలిద్దాం. సందర్భానుసారంగా ఎక్కడయినా ప్రత్యేకమైన అర్థం ధ్వనిస్తే తప్ప, ఈ విభాగానికి సంబంధించి భారతదేశం అంటే జమ్మూ, కాశ్మీర్ మినహాయించి మిగిలిన భారతదేశం అని అర్థం.

**ఆర్టికల్ 309: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల నియామకం**

ఈ రాజ్యాంగ నిబంధనలకు లోబడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో నియామకం, ఉద్యోగ నిబంధనలను చట్ట సభలు శాసనపూర్వకంగా నియంత్రించు కోవలసి ఉంటుంది.

అయితే, పైన ఉదహరించిన విధంగా చట్టసభలు శాసనాలు రూపొందించు వరకు కేంద్ర ప్రభుత్వ సర్వీసులలో ఉద్యోగ నియామకం, ఉద్యోగ నిబంధనలను రాష్ట్రపతిగాని లేక ఆయన అధీకృత ప్రతినిధిగాని రూపొందించవచ్చు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ సర్వీసులలో ఉద్యోగ నియామకం, ఉద్యోగ నిబంధనలను సంబంధిత రాష్ట్ర గవర్నర్ లేక ఆయన అధీకృత ప్రతినిధి రూపొందించవచ్చు.

**ఆర్టికల్ 310: సివిల్ ఉద్యోగుల పదవీకాలపరిమితి**

1) సాధారణ పరిస్థితులలో రక్షణదళాల ఉద్యోగులు, కేంద్ర ప్రభుత్వంలోని సివిల్ సర్వీసులలోని ఉద్యోగులు, అఖిలభారత సర్వీసులలోని ఉద్యోగులు రాష్ట్రపతి ఇచ్ఛానుసారం ఉద్యోగాలలో కొనసాగుతారు. రాష్ట్ర సివిల్ సర్వీసులలోని ఉద్యోగులు రాష్ట్ర గవర్నరు ఇచ్ఛానుసారం ఉద్యోగాలలో కొనసాగుతారు. అయితే ఇందుకు విరుద్ధంగా రాజ్యాంగంలో ప్రత్యేకమైన నిబంధన ఉంటే ఈ క్లాజు వర్తించదు.

2) పై క్లాజులో ఏమి పేర్కొనబడినప్పటికీ రక్షణ సర్వీసు లేక అఖిలభారత సర్వీసు లేదా కేంద్ర సివిల్ సర్వీసు లేక రాష్ట్ర సివిల్ సర్వీసులకు చెందని వ్యక్తిని, ఆ వ్యక్తికి గల ప్రత్యేక అర్హతల దృష్ట్యా గవర్నర్ లేక రాష్ట్రపతి ఒక ఒప్పందం క్రింద ఉద్యోగంలో చేర్చుకుని ఉండవచ్చును. అయినప్పటికీ, ఆ ఒప్పందపు కాలపరిమితి ముగియుటకు పూర్వమే ఆ పోస్టు రద్దు కాబడవచ్చు లేక ఉద్యోగానికి రాజీనామా చేయవలసిందిగా ఆ వ్యక్తిని ఆదేశించటం జరుగవచ్చు. అటువంటి సందర్భాలలో ఆ వ్యకికి తగిన పరిహారాన్ని చెల్లించాలె.

**(తరువాయి భాగం వచ్చే సంచికలో)**

## నేషనల్ టాలెంట్ సర్చ్ ఎక్జామినేషన్‌లో సత్తా చాటిన విద్యార్థిని నిత్య



సిద్ధిపేట (ప్రజాపాలన ప్రతినిధి ) :జాతీయ వ్యాప్తంగా విద్యార్థిని విద్యార్థులకు నిర్వహించే పోటీ పరీక్ష నేషనల్ టాలెంట్ సర్చ్ ఎక్జామినేషన్(ఎన్ టి ఎస్ ఈ ) లో సిద్ధిపేట విద్యార్థులు సత్తా చాటారు. నిన్న విడుదలైన ఎన్ టి ఎస్ ఈ 2021 ఫలితాలలో ఈ.నిత్య తెలంగాణ రాష్ట్ర స్థాయిలో 11 వ ర్యాంక్ సాధించింది .ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు ను కలిసిన విద్యార్థిని నిత్య , ఆమె తండ్రి రమేష్ ను మంత్రి అభినందించారు.మంత్రి మాట్లాడుతూ సిద్ధిపేట విద్యార్థులు ఇలా రాష్ట్ర స్థాయిలో ర్యాంకు లు సాధించడం హర్షణీయం అన్నారు . నిత్య శ్రీచైతన్య స్కూల్ విద్యార్థిని కావడం విశేషం .

## రైతు బాంధవుడు ముఖ్యమంత్రి కేసీఆర్

**కరోన కష్టకాలంలో రైతుబంధు నిధులు విడుదల చేసిన ఘనత కెసిఆర్ దే**



మధిర జూన్ 16, ప్రజాపాలన ప్రతినిధి:మధిర టిఆర్ఎస్ కార్యాలయంలో ఘనంగా కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకంరాష్ట్రంలో ఓ పక్కన కరోనా మహమ్మారి విలయ తాండవం చేస్తున్న మరో పక్కన వ్యవసాయం సీజన్ ప్రారంభం కాబోతున్న సమయంలో కరోనకష్ట కాలాన్ని సైతం లెక్క చేయక రైతులకు వ్యవసాయ సాగుకు రైతుబంధు సహాయం విడుదల చేసిన రైతు బాంధవుడు ముఖ్యమంత్రి కెసిఆర్ అని మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు మండల అధ్యక్షులు రావూరి శ్రీనివాసరావు రైతుబంధు కన్వీనర్ చావా వేణు పేర్కొన్నారు. కరోనా కష్టకాలంలో రైతులకు వ్యవసాయ సాగు చేసుకునేందుకు రైతుబంధు నిధులు విడుదల చేసినందుకు బుధవారం టిఆర్ఎస్ కార్యాలయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ రంగి శెట్టి కోటేశ్వరరావు, పట్టణ కార్యదర్శి అరిగే శ్రీనివాసరావు, టిఆర్ఎస్ పట్టణ బాధ్యులు కనుమూరు వెంకటేశ్వరరావు, టిఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వై వి అప్పారావు, మార్కెట్ డైరెక్టర్ గుర్రాల సైదిరెడ్డి, కటికల సీతారామరెడ్డి, కొటారి రాఘవరావు, శ్రీనివాస్ రెడ్డి, జేవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించిన మేయర్, డిప్యూటీ మేయర్

మేడిపల్లి, జూన్16 (ప్రజాపాలన ప్రతినిధి) : పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని 23వ డివిజన్ సాయి నగర్ కాలనీలో మున్సిపల్ జనరల్ ఫండ్ అంచనా రూ 5.00 లక్షల వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులను డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, స్థానిక కార్పొరేటర్ ఎన్. మధుసూదన్ రెడ్డితో కలిసి నగర మేయర్ జక్క వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గుతేదారు చంద్రశేఖర్, కాలనీ వాసులు టి.వెంకట్ రావు, జెట్ట అరుణ్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్, సతీష్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సర్కారు వారి అప్డేట్స్ పై స్పందించిన తమన్..!

తెలుగు ఇండస్ట్రీలో ప్రస్తుతం వరుస మ్యూజికల్ హిట్స్ తో తమన్ హవా మాములుగా లేదు. ఇటీవల రెండుమూడేళ్లుగా తమన్.. అటు దర్శకులకు ఇటు హీరోలకు మోస్ట్ ఫేవరేట్ అయిపోయాడు. ఎందుకంటే సినిమా ఎలా ఉన్నప్పటికీ తన మ్యూజిక్ తో సినిమాను నిలబెట్టే స్థాయిలో తమన్ పేరు తెచ్చుకున్నాడు. సాంగ్స్ తో పాటు బాక్గ్రౌండ్ మ్యూజిక్ విషయంలో తమన్ ఇప్పుడు అందరికి బెస్ట్ ఆప్షన్ లా కనిపిస్తున్నాడు. అరవిందసమేత.. మజిలీ.. అలవైకుంఠపురంలో.. క్రాక్.. వకీల్ సాబ్ ఇలా తన ప్రతి సినిమాను సంగీతం పరంగా హైలైట్ చేస్తూ హిట్స్ అందుకుంటున్నాడు.తమన్ ప్రస్తుతం సూపర్ స్టార్ మహేష్ నటిస్తున్న 'సర్కారు వారి పాట' సినిమాకు సంగీతం అందిస్తున్నాడు. తమన్ సంగీతం అనేసరికి సర్కారు పాటపై అందరికి ఆసక్తి పెరిగింది. ఎందుకంటే మహేష్ బాబుతో తమన్ ఆల్రెడీ హ్యాట్రిక్ మ్యూజిక్ ఆల్బమ్స్ ఖాతాలో వేసుకున్నాడు. వీరి కాంబినేషన్ లో దూకుడు.. బిజినెస్ మ్యాన్.. ఆగడు సినిమాలు మ్యూజిక్ పరంగా సూపర్ హిట్ అయినవే. దాదాపు ఆరు సంవత్సరాల తర్వాత తమన్ – మహేష్ కాంబినేషన్ లో సినిమా రాబోతుంది. తాజాగా తమన్ సర్కార్ సినిమా పై స్పందించాడు. 'సర్కార్ లో మొత్తం 5 పాటలు ఉన్నాయి. అందులో మూడు పాటలు ఆల్రెడీ కంప్లీట్ చేసాను. ఇంకా రెండు మిగిలి ఉన్నాయి.సర్కార్ ఆల్బమ్ దాదాపుగా మాస్ అండ్ ఎనర్జిటిక్ సాంగ్స్ తో ఉండబోతుందని చెప్పాడు. అలాగే ఈ సినిమాలో కూడా ఓ




మాస్ మసాలా ఐటమ్ సాంగ్ కూడా ఉంటుందని కిక్కిచ్చాడు తమన్. తాజాగా అప్డేట్స్ త్వరలోనే అందిస్తామంటూ సోషల్ మీడియా పోస్ట్ ద్వారా తెలిపాడు. అలాగే ఈ సినిమా మ్యూజిక్ కంప్లీట్ చేయడానికి తాను కూడా ఉత్సాహంగా ఉన్నట్లు చెప్తూ సర్కారు వారి పాట అనే మ్యూజిక్ బిట్ వదిలాడు. ప్రస్తుతం అది ట్విట్టర్ లో ట్రెండ్ అవుతోంది. ఈ సినిమాలో మహేష్ సరసన కీర్తిసురేష్ హీరోయిన్.. కాగా సినిమాకు పరశురామ్ దర్శకత్వం వహిస్తున్నాడు. మైత్రి 14 ప్లస్ బ్యానర్స్ తో పాటు మహేష్ కూడా సినిమాను నిర్మిస్తున్నాడు. ఈ సినిమా వచ్చేఏడాది సంక్రాంతికి రానుందని సమాచారం.

# బాలీవుడ్ సినిమాకు దర్శకుడుగా సౌత్ స్టంట్ మాస్టర్..!



ప్రస్తుతం సినీ ఇండస్ట్రీలో దర్శకులు మాత్రమే దర్శకత్వం చేయడం లేదు. డాన్స్ కొరియోగ్రాఫర్స్ – స్టంట్ మాస్టర్స్ కూడా దర్శకులుగా మారుతున్నారు. వారి అదృష్టం పరీక్షించుకుంటున్నారు. అయితే ఆల్రెడీ సొంతభాషలో దర్శకుడుగా పరిచయం అయిన ఓ స్టంట్ మాస్టర్ ప్రస్తుతం బాలీవుడ్ సినిమా దర్శకుడుగా డెబ్యూ చేసేందుకు సిద్ధం అవుతున్నాడు. ఆల్రెడీ సౌత్ టు బాలీవుడ్ ఇండస్ట్రీ వరకు స్టార్ హీరోలకు ఫైట్స్ కంపోజ్ చేసి ఇప్పుడు వారికే యాక్షన్ కట్ చెప్పే ప్లాన్ లో ఉన్నాడు స్టంట్ డైరెక్టర్ రవివర్మ. బేసిగ్గా కన్నడ ఇండస్ట్రీలో కెరీర్ ప్రారంభించిన రవవర్మ.. సౌత్ టు నార్త్ వరకు ఎన్నో సినిమాలకు వర్క్ చేసాడు.తెలుగులో కూడా స్టార్ హీరోలతో వర్క్ చేసాడు. యాక్షన్ డైరెక్టర్ గా కొనసాగుతూనే కన్నడ సూపర్ స్టార్ శివరాజ్కుమార్ హీరోగా రుస్తుమ్ సినిమాతో దర్శకుడుగా మారాడు. స్టంట్ కొరియోగ్రాఫర్ నుండి దర్శకుడుగా మారి ప్రస్తుతం తన రెండవ సినిమా కోసం రెడీగా ఉన్నాడు. లాక్డౌన్ సమయంలో తన సినిమాలకు సంబంధించి స్క్రిప్ట్ కూడా సిద్ధం చేసుకున్నాడట. తాజాగా తన తదుపరి సినిమా విషయాన్నీ ఆయనే స్వయంగా మీడియాలో వెల్లడించాడు. సెకండ్ వేవ్ లాక్డౌన్ సమయంలో తాను రెండు స్క్రిప్టు దాదాపు సిద్ధం చేసానని ఈ యాక్షన్ డైరెక్టర్ చెప్పాడు.అయితే తదుపరి సినిమా మాత్రం తాను బాలీవుడ్ లో చేయాలనీ అనుకుంటున్నట్లుగా పోస్ట్ లో తెలిపాడు. "నేను సెకండ్ మూవీ హిందీలో చేయాలనుకుంటున్నాను. అందుకు సంబంధించి ప్రస్తుతం వివిధ నిర్మాణ సంస్థలతో చర్చలు జరుపుతున్నాను. ప్రాజెక్ట్ కన్ఫర్మ్ అయ్యాక నటినటులను ఎంపిక చేస్తాను. బాలీవుడ్లో నా స్టంట్ కొరియోగ్రఫీ గురించి ఆల్రెడీ అందరికి తెలుసు. కానీ నా రెండవ చిత్రం కాస్త భిన్నంగా ఉంటుంది. ఇది అన్ని మాస్ క్లాస్ అంశాలతో వినోదభరిత కమర్షియల్ సినిమాగా ఉండబోతుంది." అని క్లారిటీ ఇచ్చేసాడు. ఇప్పటివరకు బాలీవుడ్ సల్మాన్ ఖాన్ షారూఖ్ ఖాన్ షాహిద్ కపూర్ మరియు విద్యూత్ జామ్వాల్ సహా చాలామంది బి–టౌన్ హీరోలతో కలిసి పనిచేశాడు రవివర్మ. ఇటీవలే తెలుగులో వకీల్ సాబ్ సినిమాకు యాక్షన్ డైరెక్టర్ గా వర్క్ చేసాడు. ప్రస్తుతం సెకండ్ మూవీ విషయంలో బిజీగా ఉన్నట్లు చెబుతున్నాడు ఈ యాక్షన్ డైరెక్టర్. చూడాలి మరి బాలీవుడ్ దర్శకుడుగా సక్సెస్ అందుకుంటాడేమో!

# 'రాధే శ్యామ్' గురించి ప్రియదర్శి చెప్పిన ఆసక్తికరమైన విషయాలు..!

'పెళ్లి చూపులు' సినిమాతో కమెడియన్ గా ఇండస్ట్రీలో అడుగుపెట్టిన టాలెంటెడ్ యాక్టర్ ప్రియదర్శి.. ఇప్పుడు విలక్షణమైన పాత్రలతో మెప్పిస్తూ వస్తున్నాడు. ఓవైపు కామెడీతో నవ్విస్తూనే మరోవైపు సీరియస్ రోల్స్ చేస్తున్నాడు. దర్శి నటించిన లేటెస్ట్ క్రైమ్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ 'ఇన్ ది నేమ్ ఆఫ్ గాడ్' మరికొన్ని గంటల్లో ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. అలానే యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'రాధే శ్యామ్' సినిమాలో కూడా దర్శి కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఇటీవల ఓ ఇంటరాక్షన్ సందర్భంగా ప్రియదర్శి 'రాధే శ్యామ్' సినిమా గురించి.. ప్రభాస్ గురించి పలు ఆసక్తికరమైన విషయాలు వెల్లడించాడు.'రాధే శ్యామ్' ఒక గ్రేట్ సినిమాటిక్ ఎక్సపీరియన్స్ అని





ఇందులో తన పాత్ర కామెడీ టచ్ తో ఉంటుందని ప్రియదర్శి చెప్పాడు. అంతేకాదు ఇందులో తనది హీరోయిన్ పూజా హెగ్డేను ఇంప్రెస్ చేయడానికి ట్రై చేసే పాత్ర అని దర్శి తెలిపాడు. అలానే తనకు ప్రభాస్ అన్నకు మధ్య మంచి కామెడీ సన్నివేశాలు ఉన్నాయని అన్నాడు. ప్రభాస్ తనను స్వీట్ హార్ట్ అని పిలుస్తాడని.. ఆయనతో ఎక్కువ సమయం గడపాలని మాట్లాడాలని అనిపిస్తుందని.. ప్రభాస్ ఆతిథ్యాన్ని తాను ఎప్పటికీ మరచిపోలేనని ప్రియదర్శి చెప్పుకొచ్చారు. ఇకపోతే ప్రభాస్ నటిస్తున్న 'ఆదిపురుష్' సినిమాలో కూడా ప్రియదర్శి కీలక పాత్ర పోషిస్తున్నారని సమాచారం.

# ప్రమోషన్స్ స్టార్ట్ చేయనున్న స్టార్ హీరోలు..!

కరోనా రెండో దశ కారణంగా సినీ ఇండస్ట్రీలో కార్యక్రమాలు అర్థాంతరంగా నిలిచిపోయాయి. గత రెండు నెలలుగా షూటింగులు నిలిచిపోయి.. థియేటర్లు మూతబడి ఉన్నాయి. అయితే ఇప్పుడు రోజురోజుకు కోవిడ్ కేసులు తగ్గుముఖం పట్టడంతో టాలీవుడ్ లో సానుకూల వాతావరణం కనిపిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో లాక్ డౌన్ నిబంధనలను సడలించడంతో కొందరు మేకర్స్ సినిమాలను తిరిగి సెట్స్ పైకి తీసుకెళ్లారు. అలానే జులై చివరి వారం నుంచి థియేటర్లు కూడా రీ ఓపెన్ చేస్తారనే సంకేతాలు వస్తుండటంతో సినిమాల ప్రమోషన్స్ కూడా స్టార్ట్ చేయడానికి రెడీ అవుతున్నారని తెలుస్తోంది.వైరస్ ప్రభావంతో చాలా సినిమాల విడుదల వాయిదా పడింది. థియేటర్లలో ప్రదర్శనలకు అనుమతులు ఇచ్చిన వెంటనే వసూళ్లు ఆశాజనకంగా ఉంటే.. ఆగస్ట్ ఫస్ట్ వీక్ నుంచి క్రేజీ మూవీస్ విడుదలయ్యే అవకాశం ఉంది. అందుకే ఇప్పటి నుంచే ప్రమోషనల్ కార్యక్రమాలు ప్రారంభించడానికి ప్రయత్నిస్తున్నారని తెలుస్తోంది. ఇప్పటికే ఫస్ట్ లుక్ – టీజర్స్ అంటూ బజ్ క్రియేట్ చేసిన కొన్ని సినిమాలు.. మళ్ళీ తిరిగి జానాల్లోకి వెళ్లాలని చూస్తున్నాయి. ఇప్పటికే మెజారిటీ భాగం షూటింగ్ జరుపుకున్న 'ఆచార్య' 'పుష్ప' వంటి పెద్ద సినిమాలు కూడా ప్రమోషన్లను షురూ చేయనున్నారు. 'ఆచార్య' నుంచి త్వరలోనే రెండో పాటను రిలీజ్ చేయాలని ప్లాన్ చేసుకోగా.. 'పుష్ప' ఫస్ట్ సింగిల్ ఇవ్వాలని అనుకుంటున్నారట. మరి వీటిలో ముందుగా ఎవరు పబ్లిసిటీ మొదలుపెడతారో చూడాలి.


# ఆ హీరోతో వెళ్లిపోవాలని ఆశగా ఉంది:నటి

రణ్ బీర్ కపూర్.. బాలీవుడ్ లో హ్యాండ్సమ్ హీరో. ఎంతో మంది అమ్మాయిల కలల రాకుమారుడు. అయితే.. సాధారణ ఫ్యాన్స్ కే కాదు.. తనకు కూడా అతనంటే పిచ్చి అంటోంది బుల్లితెర నటి ఆషా నేగి. హిందీ టీవీ నటిగా ఆషా నేగి చాలా పాపులర్. చాలా సీరియల్స్ లో లీడ్ రోల్స్ చేసింది. క్రమంగా వెండి తెరవైపు అడుగులు వేస్తోంది.ఈ బ్యూటీ నటించిన "క్వాంబోంకే పరిందే" అనే వెబ్ సిరీస్ ప్రస్తుతం ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సిరీస్ స్టోరీ ఏమంటే.. ఓ వ్యాన్ జర్నీ చుట్టూ నడుస్తుంది. ఆశ నేగితోపాటు మరికొందరు ఆ వ్యాన్ లో ప్రయాణిస్తుంటారు. ఆస్ట్రేలియాలోని మెల్ బోర్న్ నుంచి పెర్త్ కు సాగే ప్రయాణమే ఈ వెబ్ సిరీస్ కథ. ఈ జర్నీలో ఎన్నో అందమైన లొకేషన్ల వచ్చి పోతుంటాయి.అయితే.. ఇలాంటి జర్నీని రియల్ లైఫ్ లో చేయాలని అది కూడా తన ఆల్ టైమ్ హ్యాండ్సమ్ హీరో రణ్ బీర్ తో కలిసి లాంగ్ డ్రైవ్ వెళ్లాలని ఆశపడుతోంది నేగి. తనకు ప్రకృతి అంటే ఎంతో ఇష్టమని



చెబుతున్న ఈ బ్యూటీ.. రణ్ బీర్ తో కలిసి కొండలు గుట్టలు ఎక్కేస్తూ ఆస్వాదించాలని కోరికగా ఉందట. ఈ వెబ్ సిరీస్ ప్రమోషన్ కోసం ఈ వ్యాఖ్యలు చేసిందో.. లేక నిజంగానే మనసులో ఉన్నమాటలో తెలియదుగానీ.. మొత్తానికి బయట పెట్టేసింది. మరి ఈ ఆఫర్ కు రణ్ బీర్ ఏమంటాడో..?


# పాన్ ఇండియా స్థాయిలోకి ఐకాన్ స్క్రిప్ట్..?



సినిమా ఇండస్ట్రీలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరికీ తెలీదు. ఎందుకంటే ఒకసారి అనుకున్న సినిమా ఎందుకు పట్టాలెక్కకుండా ఆగిపోయింది తెలీదు. కొంతకాలానికి అదే సినిమా మళ్లీ పట్టాలెక్కడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆల్రెడీ ఇంకా రాదేమో అనుకున్న సినిమా ఒక్కసారిగా మళ్లీ రాబోతుంది అని తెలిస్తే ఫ్యాన్స్ రియాక్షన్ ఎలా ఉంటుందో చెప్పే అవసరం లేదు. నిజానికి ఇండస్ట్రీ అనేది సక్సెస్ లో ఉన్నప్పుడే అవకాశాలు ఇస్తుంది అనేది వాస్తవం. అందుకే వకీల్ సాబ్ లాంటి బ్లాక్ బస్టర్ హిట్ పడితే గాని డైరెక్టర్ రియల్ స్టామినా గుర్తించలేకపోయారు టాలీవుడ్ స్టార్స్. ఎప్పుడో సినిమా మొదలవుతుందని గతంలోనే పోస్టర్ కూడా రిలీజ్ చేశారు.తీరా మొదలవుతుంది అనుకునే టైంలో అటు హీరో ఇటు డైరెక్టర్ వేరే సినిమాలతో బిజీ అయిపోయారు. ఇదంతా స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ నటించబోయే ఐకాన్ సినిమా గురించి ఇండస్ట్రీ టాక్. ఇటీవలే వకీల్ సాబ్ సినిమా బ్లాక్ బస్టర్ అందుకొని ఫామ్ లోకి వచ్చాడు డైరెక్టర్ వేణుశ్రీరామ్. ప్రముఖ నిర్మాత దిల్ రాజు నిర్మాతగా వేణుశ్రీరామ్ దర్శకత్వంలో రెండేళ్లు కిందటే పోస్టర్ రిలీజ్ చేశారు. కానీ ఎందుకో ఆ టైంలో సినిమా కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం అల్లు అర్జున్ టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ సుకుమార్ తో పాన్ ఇండియా మూవీ పుష్ప చేస్తున్నాడు. ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న సినిమాతో అల్లు అర్జున్ పాన్ ఇండియా హీరోగా ఎంట్రీ ఇవ్వనున్నాడు.అయితే పుష్ప రెండు భాగాలుగా రాబోతుండటంతో మొదటి పార్ట్ పూర్తి చేస్తున్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో అల్లు అర్జున్ లారీడ్రైవర్ పాత్రలో కనిపించనున్నాడు. ఇదిలా ఉండగా.. ప్రస్తుతం అల్లు అర్జున్ తదుపరి సినిమాలన్ని కూడా పాన్ ఇండియా రేంజిలోనే ఉండబోతున్నాయట. పుష్ప మొదటి భాగం అయిపోగానే వెంటనే ఐకాన్ మూవీ పట్టాలెక్కనుంది. అందుకే ప్రస్తుతం బన్నీ పాన్ ఇండియా స్టేటస్ దృష్టిలో పెట్టుకొని డైరెక్టర్ వేణుశ్రీరామ్.. నిర్మాత దిల్ రాజు ఇదివరకు అనుకున్న ఐకాన్ స్క్రిప్ట్ పాన్ లెవెల్లో డెవలప్ చేస్తున్నారని సమాచారం. ఈ సినిమాలో కూడా స్టైలిష్ స్టార్ పవర్ ఫుల్ రోల్ ప్లే చేయనున్నట్లు తెలుస్తుంది. చూడాలి మరి త్వరలో అనౌన్స్ మెంట్ రానుందేమో!

## అతనికి మ్యూజిక్ మాత్రమే కాదు.. ఫోటోగ్రఫీ కూడా తెలుసంట!

సినీ ఇండస్ట్రీలో ప్రస్తుతం స్టార్స్ గా వెలుగుతున్న వారంతా మల్టీటాలెంటెడ్ అని ప్రూవ్ చేసుకుంటున్నారు. టైం వచ్చినప్పుడు ఒక్కొక్కరుగా బయటపడుతున్నారు. ఈ లాక్ డౌన్ సమయంలో సెలబ్రిటీలు అందరూ వారి అదనపు టాలెంట్స్ సోషల్ మీడియాలో ప్రదర్శిస్తున్నారు. తాజాగా మ్యూజిక్ సెన్సేషన్ తమన్ కూడా సంగీతం కాకుండా వేరే టాలెంట్ బయటపెట్టాడు. ఇటీవలే తమన్ స్టార్ హీరో అండ్ డైరెక్టర్ ఫోటోలు పోస్ట్ చేసాడు. ఆ ఫోటోలు స్వయంగా తమన్ తీసినట్లు తెలిపాడు. అంటే తమన్ లో మంచి ఫోటోగ్రఫీ టాలెంట్ కూడా ఉందని తెలుస్తుంది.స్టార్ హీరో అల్లు అర్జున్ – డైరెక్టర్ త్రివిక్రమ్ లను తమన్ కాప్చర్ చేసాడు. అదికూడా ఇండియాలో మాత్రం కాదు. ఫోటోలు చూస్తే బ్లాక్ అండ్ వైట్ లో ఇద్దరూ స్టైలిష్ గా కనిపిస్తున్నారు. అల్లు అర్జున్ ఫోటోలో బ్యాక్ సైడ్ సన్ షైన్ కనిపించడం విశేషం అయితే త్రివిక్రమ్ ఫోటోలో ఈఫిల్ టవర్ కవర్ చేయడం విశేషమనే చెప్పాలి. ఈ రెండు ఫోటోలు బట్టి అలవైకుంఠపురంలో షూటింగ్ సమయంలో తీసినట్లుగా అనిపిస్తుంది. నిజమో కాదో గాని స్టిల్స్ ప్రకారం.. మోస్ట్ పాపులర్ సామజవరాగమనా సాంగ్ టైంలో తీసినట్లు సోషల్ మీడియాలో నేటిజన్లు గెస్ చేస్తూ కామెంట్స్ పెడుతున్నారు. అలవైకుంఠపురంలో సినిమాకు తమనే సంగీతం అందించాడు.ఆ ఆల్బమ్ ఎంత హిట్ అయిందో అందిరికి తెలిసిందే. ఆల్రెడీ తదుపరి సినిమాలు కూడా లైనప్ చేసుకున్నాడు. ప్రస్తుతం తమన్ చేతిలో టాలీవుడ్ స్టార్ యాక్టర్స్ సినిమాలన్ని ఉన్నాయి. అందులో సూపర్ స్టార్ మహేష్ బాబుతో సర్కారు వారి పాట కూడా ఉంది. ఆ సినిమా అనంతరం మహేష్ డైరెక్టర్ త్రివిక్రమ్ తో తదుపరి సినిమా చేయనున్నాడు. వీరి కాంబినేషన్ లో వస్తున్న హ్యాట్రిక్ సినిమా ఇది. అయితే ఈ సినిమాకు సంగీతం తమన్ అందిస్తున్నాడు. అంటే తమన్ కు అటు త్రివిక్రమ్ తో మూడో సినిమా.. మహేష్ బాబుతో ఐదో సినిమా. మరి ఇప్పటివరకు మ్యూజికల్ గా అయితే తమన్ సక్సెస్ అవుతూనే ఉన్నాడు. చూడాలి మరి నెక్స్ట్ ఆల్బమ్స్ ఎలా ఉండబోతున్నాయో!



Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989